మీరే చదువరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక

మీరే విలేకరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

ఆదివారం SUNDAY 15-2-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 8 PAGES:8 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 1 Volume:1 | సంచిక: 227 Issue: 227

15 ఫిబ్రవరి 2026 - ఆదివారం శ్రీ విశ్వావసు నామ సంవత్సరం ఉత్తరాయణం - శిశిర ఋతువు మాఘ మాసం - కృష్ణపక్షం సూర్యోదయం - ఉ. 6:46 సూర్యాస్తమయం - సా. 6:14 తిథి త్రయోదశి సా. 5:01 వరకు తరువాత చతుర్దశి సంస్కృత వారం భాను వాసరః నక్షత్రం ఉత్తరాషాఢ రా. 7:36 వరకు తరువాత శ్రవణ యోగం వ్యతీపాత రా. 2:390 వరకు కరణం వనిజ సా. 5:01 వరకు విష్టి తె. 5:230 వరకు వర్జ్యం రా. 11:58 నుండి రా. 1:38 వరకు దుర్ముహూర్తం సా. 4:42 నుండి సా. 5:27 వరకు రాహుకాలం సా. 4:48 నుండి సా. 6:14 వరకు యమగండం మ. 12:30 నుండి మ. 1:56 వరకు గుళికాకాలం మ. 3:22 నుండి సా. 4:48 వరకు బ్రహ్మముహూర్తం తె. 5:10 నుండి తె. 5:58 వరకు అమృత ఘడియలు మ. 12:59 నుండి మ. 2:41 వరకు అభిజిత్ ముహూర్తం మ. 12:07 నుండి మ. 12:53 వరకు గమనిక: "o" అనగా మరుసటి రోజున

Published from Jagitial
www.evarthalu.com










## ఇదా రాజకీయం..? ఇదా ప్రజా క్షేమం??

విమర్శలు అర్థవంతంగా ఉండాలి. ప్రజా సమస్యలను లేవనెత్తేలా చర్యలు ఉండాలి. కానీ, జరుగుతున్న రాజకీయం ఏంటీ? అంటే ఇదే. ఒక పార్టీని మించి ఒక పార్టీ తమ సోషల్ మీడియా అకౌంట్లలో ఎడిటింగులు, కామెంట్లు చేసుకుంటూ ప్రజాసమస్యలను తప్పుదోవ పట్టిస్తున్నాయి. ఒకరు తిట్లు తిడతారు.. ఇంకొకరు ప్రతిదాడి చేస్తారు.. ఇదేమైనా ప్రజల కోసం చేస్తున్నదా? అంటే కానేకాదు. ఎంటర్‌టైన్‌మెంట్ కోసం పాకులాట తప్ప. వ్యాలంటైన్స్ డే సందర్భంగా కాంగ్రెస్ పార్టీ తన ట్విట్టర్ అకౌంట్‌లో మోదీకి బీఆర్ఎస్ ప్రేమ అంటూ పోస్ట్ చేసింది. దాంతో తామేమైనా తక్కువా అని బీజేపీ, బీఆర్ఎస్ అకౌంట్లలోనూ ఎడిటింగ్‌ల పోస్టులు దర్శనమిచ్చాయి. ఆయనకు ఇద్దరు (ఒవైసీ పక్కన కేసీఆర్, రేవంత్ ఫొటోలు) అని, ఇంట్లో ఇల్లాలు వంటింట్లో ప్రియురాలు (మోదీ పక్కన రేవంత్, అసద్ ఫొటోలు) అని పోస్ట్ చేశాయి. తమకు తామే ఎంత దిగజారామో మరోసారి రుజువు చేసుకున్నాయి. – ఈవార్తలు



7

## కాస్కో.. దాయాది!

నేడే చెమటలు పుట్టించే మ్యాచ్
అడ్డం పడతానంటున్న వరుణుడు
సా. 7 గంటలకు భారత్-పాక్ మ్యాచ్

# 17న రైతు భరోసా?

### మున్సిపల్ రిజల్ట్ జోష్‌లో కాంగ్రెస్

## పరిషత్తు ఎన్నికలే టార్గెట్!

కాంగ్రెస్ ప్రభుత్వం మున్సిపల్ ఎన్నికల ఫలితాలు ఇచ్చిన జోష్‌లో ఉంది. మున్సిపల్ ఎన్నికల్లో మెజారిటీ స్థానాలు కైవసం చేసుకోవడంతో.. మున్సిపల్ ఎన్నికల ప్రక్రియ పూర్తైన వెంటనే రైతులకు.. రైతు భరోసా నిధులు విడుదల చేయాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు సమాచారం. రైతు భరోసా పథకం కింద యాసంగి సీజన్‌కు సంబంధించి రైతులకు పెట్టుబడి సాయంగా.. వారి బ్యాంక్ ఖాతాలలో నిధులు జమ చేయనున్నారు.

హైదరాబాద్, ఫిబ్రవరి 14 (ఈవార్తలు): ఎకరాకు రూ.6,000 చొప్పున రైతు భరోసా డబ్బులను అర్హులైన రైతుల ఖాతాల్లో జమ చేయనున్నారు. ఇందుకోసం ఫిబ్రవరి 17వ తేదీని ముహూర్తంగా నిర్ణయించినట్లు సమాచారం. ఈ నిధుల కోసం ప్రభుత్వం ఇప్పటికే నిధులను సమీకరించుకుంది. మున్సిపల్ ఎన్నికలకు ముందే రైతు భరోసా నిధులు విడుదల చేయాలని ప్రభుత్వం భావించింది. అయితే అనుకోని కారణాలతో నిధుల విడుదల ఆలస్యమైంది. మరోవైపు మిర్యాలగూడ సభలో సీఎం రేవంత్ రెడ్డి కూడా రైతు భరోసా నిధులపై క్లారిటీ ఇచ్చారు. ఎన్నికలు పూర్తైన వెంటనే రైతుల బ్యాంక్ ఖాతాల్లో రైతు భరోసా నిధులు జమ చేస్తామని ప్రకటించారు. అందులో భాగంగానే రూ.9 వేల కోట్లు నిధులు కూడా సమీకరించుకున్నట్లు తెలిసింది. తాజాగా తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల పోలింగ్, కౌంటింగ్ కూడా పూర్తైంది. ఎన్నికల ఫలితాలు ఇచ్చిన జోష్‌లో ఫిబ్రవరి 17వ తేదీన రైతుభరోసా నిధులు విడుదల చేయాలని తెలంగాణ సర్కారు భావిస్తున్నట్లు తెలిసింది. ఈ విషయం మీద మంత్రులతో సీఎం సమాలోచనలు చేస్తున్నట్లు సమాచారం. భరోసా నిధులు వేసి, పరిషత్తు ఎన్నికలకు వెళ్లే ఆలోచనలో కాంగ్రెస్ సర్కారు ఉన్నట్లు సమాచారం.



## హంగ్ బాధ్యతలు మంత్రులకు!

### సీఎం రేవంత్ కీలక సమావేశం

హైదరాబాద్, ఫిబ్రవరి 14 (ఈవార్తలు): రాష్ట్ర మంత్రులతో సీఎం రేవంత్ రెడ్డి శనివారం కీలక సమావేశం నిర్వహించారు. మున్సిపల్ ఎన్నికల ఫలితాలు వెలువడిన నేపథ్యంలో తదుపరి రాజకీయ వ్యూహాలపై ముఖ్యమంత్రి మంత్రులతో సుదీర్ఘంగా చర్చించారు. మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేసిన రేవంత్.. హంగ్ వచ్చిన స్థానాలపై ఫోకస్ పెట్టాలని మంత్రులకు సూచించారు. మేయర్, ఛైర్మన్ ఎన్నికల నాటికి ఎక్స్ అఫిషియో ఓట్ల వినియోగం ద్వారా అన్ని మున్సిపాలిటీలపై హస్తం జెండా ఎగురవేయాలని మంత్రులకు బాధ్యతలు అప్పగించారు. కొన్ని చోట్ల ఆశించిన ఫలితాలు రాకపోవడానికి గల కారణాలను విశ్లేషించారు.




## ఓటు ఉన్నచోటే ఎక్స్‌అఫీషియో

### క్లారిటీ ఇచ్చిన ఎన్నికల సంఘం

మున్సిపల్ ఎన్నికల ఫలితాల నేపథ్యంలో ఎక్స్‌అఫీషియో ఓటుపై రాష్ట్ర ఎన్నికల సంఘం స్పష్టతనిచ్చింది. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు నియోజకవర్గ పరిధిలో ఎక్స్‌అఫీషియో ఓటు వినియోగించుకోవడం వివరణ ఇచ్చింది. ఎమ్మెల్సీలు, ఎంపీలు తమ నియోజకవర్గ పరిధిలోని ఏదైనా ఒక మున్సిపాలిటీలో ఎక్స్‌అఫీషియో ఓటు వినియోగించుకోవచ్చని రాష్ట్ర ఎన్నికల సంఘం తెలిపింది.

2




## కొత్తగూడెం మేయర్.. కాంగ్రెస్–సీపీఐ

### చెరో రెండున్నరేళ్లు మేయర్ సీటు పంపకం

కొత్తగూడెం, ఫిబ్రవరి 14 (ఈవార్తలు: కొత్తగూడెం కార్పొరేషన్‌లో హంగ్ ఏర్పడటంతో నెలకొన్న సందిగ్ధంపై కాంగ్రెస్–సీపీఐల మధ్య చర్చలు సఫలం కావడంతో కొత్తగూడెం మేయర్ పీఠంపై పీటముడి వీడింది. కాంగ్రెస్–సీపీఐ పొత్తుతో మేయర్ పీఠం కైవసం చేసుకోవాలని నిర్ణయానికి వచ్చింది. దీనిలో సీపీఐకి మేయర్ పదవి ఇచ్చేందుకు కాంగ్రెస్ అంగీకరించింది. డిప్యూటీ మేయర్ పదవి కాంగ్రెస్‌కు ఇచ్చేందుకు ఒప్పందం కుదిరింది. కొత్తగూడెం తరువాయి 2 వ పేజీలో...

## బంగారం-వెండి ధరలు

| | |
|---|---|
| బంగారం (గ్రాము-24 క్యారెట్స్): | రూ.15,775 |
| వెండి (గ్రాము): | రూ.280 |
| ప్లాటినం (గ్రాము): | రూ.6,006 |



## అసలు సినిమా ముందుంది

### బీఆర్ఎస్ పార్టీకి కవిత హెచ్చరిక

తెలంగాణ జాగృతి రాజకీయ పార్టీగా మారబోతుందని ప్రకటించగానే బీఆర్ఎస్ పార్టీకి చెందిన వారు తమను ట్రోలింగ్ చేశారని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత మండిపడ్డారు. కానీ తమను లక్ష్యంగా చేసుకున్న వారికి ఒకటే విషయం చెబుతున్నానని, ఇది కేవలం ట్రైలర్ మాత్రమేనని, అసలు సినిమా ముందుందని హెచ్చరించారు.

హైదరాబాద్, ఫిబ్రవరి 14 (ఈవార్తలు): ఇప్పుడే తొందరపడి మాట జారవద్దని, తమపై కారుకూతలు కూయవద్దని బీఆర్ఎస్ వారిని హెచ్చరించారు. ఇప్పటికైనా మీ తప్పులను సరిదిద్దుకోవాలని అన్నారు. అధికారంలో ఉన్నప్పుడు వారు ఉద్యమకారులను కూడా పట్టించుకోలేదని ఆరోపించారు. జూబ్లీహిల్స్‌లోని జాగృతి కార్యాలయంలో ఆమె మీడియాతో మాట్లాడుతూ, గతంలో 90 శాతం మున్సిపాలిటీలను గెలుచుకున్న బీఆర్ఎస్ ఈసారి 16 స్థానాలకే పరిమితమైందని కవిత తరువాయి 2 వ పేజీలో...




### ఐఏఎస్ అరవింద్ విచారణకు

## కేంద్రం ఓకే

ఫార్ములా–ఈ కార్ రేస్ కేసులో కీలక పరిణామం

### ఛార్జ్‌షీట్‌కు ఏసీబీ రంగం సిద్ధం!

## విశ్వవాణి



ఆపదలో తనను కాపాడాడాని దిండిమ్ అనే పెంగ్విన్.. ఏటా అర్జెంటీనా తీరం నుంచి బ్రెజిల్ తీరం వరకు 5000 మైళ్ల దూరం ఈదుకుంటూ జావో పెరీరా అనే వ్యక్తిని కలిసేది.

## సంజయ్ వర్గానిదే పై‘చేయి’

2

తన వర్గంతో హైదరాబాద్‌కు
జీవన్ రెడ్డి కూడా క్యాంపునకు
రాజధానికి చేరిన జైతాల ముచ్చట

# ఏపీ బడ్జెట్ రూ.3,32,205 కోట్లు

ఏపీ శాసనసభలో ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ వార్షిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. 2026-27 ఆర్థిక సంవత్సరానికి రూ.3,32,205 కోట్లతో బడ్జెట్‌ను ప్రవేశపెడుతున్నట్లు ఆయన చెప్పారు.

అమరావతి, ఫిబ్రవరి 14 (ఈవార్తలు): తమ దృష్టిలో బడ్జెట్ అంటే కేవలం పద్దుల ప్రకటన కాదని.. రాష్ట్రాభివృద్ధి, ప్రజా సంక్షేమాన్ని జోడెద్దుల బండిలా పరుగులు పెట్టించాలనే సంకల్పం లాంటిదని పేర్కొన్నారు. స్వర్ణాంధ్ర 2047 లక్ష్యం తో ఈ బడ్జెట్ ప్రతిపాదించినట్లు వెల్లడించారు. రాయలసీమ తరువాయి 2 వ పేజీలో...




రెవెన్యూ వ్యయం
రూ. 2,56,143 కోట్లు

మూలధన వ్యయం
రూ. 53,915 కోట్లు

రెవెన్యూ లోటు
రూ. 22,002 కోట్లు

ద్రవ్య లోటు
రూ. 75,868 కోట్లు



2

## కరీంనగర్‌లో బీజేపీ బలం 34

పార్టీలో చేరిన ఐదుగురు ఇండిపెండెంట్లు

ఈవార్తలు



## రాశి ఫలాలు

15.2.2026

మేషం: ప్రయాణాలలో ఆకస్మిక మార్పులు చేస్తారు. ఆరోగ్యసమస్యలు భాదిస్తాయి. బంధు మిత్రులతో మాట పట్టింపులుంటాయి. ఇతరులతో వివాదాలకు దూరంగా ఉండటం మంచిది. పుణ్య క్షేత్ర దర్శనం చేసుకుంటారు. వ్యాపారమున ఒత్తిడి పెరుగుతుంది. ఉద్యోగులకు స్థానచలనాలు తప్పవు.

వృషభం: చిన్ననాటి మిత్రులతో సఖ్యతగా వ్యవహరిస్తారు. స్థిరాస్తి వ్యవహారాలలో నూతన ఒప్పందాలు కలసి వస్తాయి. జీవిత భాగస్వామితో శుభకార్యాలలో పాల్గొంటారు. నూతన వ్యాపారాలు ప్రారంభించిన లాభాలు అందుకుంటారు. ఉద్యోగులకు ప్రోత్సాహకాలు అందుతాయి.

మిధునం: ఆస్తి వివాదాలు తొలగి ఊరట చెందుతారు. వాహన వ్యాపారస్తులకు లాభాలు అందుకుంటారు. కీలక సమయంలో సన్నిహితుల సాయం అందుతుంది. కుటుంబ వాతావరణం ఆనందంగా ఉంటుంది. ఉద్యోగులకు హోదాలు పెరుగుతాయి. ఆకస్మిక ధనలబ్ధి కలుగుతుంది.

కర్కాటకం: వృత్తి వ్యాపారాలు ఉత్సాహంగా సాగుతాయి. చేపట్టిన వ్యవహారాలు ముందుకు సాగక నిరాశ కలిగిస్తాయి. కుటుంబ సభ్యుల ఆరోగ్య సమస్యలు బాధిస్తాయి. ప్రయాణాలు వాయిదా వేయడం మంచిది. ఇంటా బయట జాగ్రత్తగా వ్యవహరించాలి. ఉద్యోగాలు సామాన్యంగా సాగుతాయి.

సింహం: బంధువులతో వివాదాలు కలుగుతాయి. ఆరోగ్యం విషయంలో అశ్రద్ధ చేయడం మంచిది కాదు. వృత్తి వ్యాపారాలు గందరగోళ పరిస్థితులు ఉంటాయి. నూతన ఋణాలు చేస్తారు. దూర ప్రయాణం సూచనలు ఉన్నవి. ఉద్యోగమున అదనపు బాధ్యతలు విశ్రాంతి లేకుండా చేస్తాయి.

కన్య: చేపట్టిన పనులు అప్రయత్నంగా పూర్తవుతాయి. ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. ఉద్యోగ యత్నాలు విజయం వరిస్తుంది. నూతన పరిచయాలు పెరుగుతాయి. స్నేహితుల నుండి ధనలాభం కలుగుతుంది. వృత్తి వ్యాపారాలలో లాభాలు పొందుతారు.

తుల: దూర ప్రయాణాల వలన శారీరక శ్రమ కలుగుతుంది. బంధు మిత్రుల నుండి ఒత్తిడి పెరుగుతుంది. కుటుంబ పెద్దల సహకారంతో కొన్ని పనులు పూర్తవుతాయి. వ్యాపారాలు లాభాల బాట పట్టడం కష్టంగా మారుతుంది. వృత్తి ఉద్యోగాలలో శ్రమ అధిక ఫలితం తక్కువగా ఉంటుంది.

వృశ్చికం: నూతన వాహనాలు కొనుగోలు చేస్తారు. భూ సంబంధిత క్రయ విక్రయాలలో ఆశించిన లాభాలను పొందుతారు. ఇంటా బయట ఆదరణ పెరుగుతుంది. అన్ని రంగాల వారికి ఆదాయం బాగుంటుంది. వ్యాపారాలకు పెట్టుబడులు అందుతాయి. ఉద్యోగాలలో పదోన్నతులు పెరుగుతాయి.

ధనస్సు: ఉద్యోగుల విషయంలో అధికారుల నుండి ఊహించని మాటలు వినవలసి వస్తుంది. ప్రయాణాలలో మార్గ అవరోధాలు కలుగుతాయి. సోదరులతో వివాదాలు పెరుగుతాయి. వ్యాపారాలు నిరాశ కలిగిస్తాయి. ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది. ఆర్థిక వ్యవహారాలు నిరాశ కలిగిస్తాయి.

మకరం: వ్యాపారాలలో నూతన లాభాలు అందుకుంటారు. చేపట్టిన పనులలో అప్రయత్న కార్యసిద్ధి కలుగుతుంది. విలువైన వస్తు వాహనాలు కొనుగోలు చేస్తారు. ఉద్యోగ విషయమై అనుకూల మార్పులు చోటుచేసుకుంటాయి. దేవాలయ దర్శనం చేసుకుంటారు.

కుంభం: కీలక వ్యవహారాలలో అంచనాలు నిజమవుతాయి. సన్నిహితుల నుండి శుభకార్య ఆహ్వానాలు అందుతాయి. ఆకస్మిక ధన లాభం పొందుతారు. భూ సంబంధిత వివాదాల నుంచి బయటపడతారు. వృత్తి వ్యాపారాలు ఉత్సాహంగా సాగుతాయి. ఉద్యోగస్తులకు తగిన గుర్తింపు లభిస్తుంది.

మీనం: కీలక వ్యవహారాలు నిదానంగా పూర్తవుతాయి. చెయ్యని పనికి సన్నిహితుల నుండి నిందలు ఎదుర్కొంటారు. ప్రయాణాలు అకస్మాత్తుగా వాయిదా పడతాయి. వృధా ఖర్చులు చేస్తారు. నూతన వ్యాపారాలు మందగిస్తాయి. వృత్తి ఉద్యోగాలలో చికాకులు పెరుగుతాయి.

# అసలు సినిమా ముందుంది



**మొదటి పేజీ తరువాయి**

గుర్తు చేశారు. ప్రజల మద్దతును ఎందుకు కోల్పోయామో బీఆర్ఎస్ ఆలోచించాలని సూచించారు. ఉత్తర తెలంగాణలో బీజేపీ గెలుపు కోసం బీఆర్ఎస్ పనిచేసిందని కవిత ఆరోపించారు. ఆ రెండు పార్టీల పొత్తుకు ఇది తొలి మెట్టు అన్నారు. కాంగ్రెస్ పార్టీతో మిలాఖత్ అయిన సీపీఐకి కొత్తగూడంలో బీఆర్ఎస్ పార్టీ మద్దతివ్వడం విడ్డూరంగా ఉందని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో కేసీఆర్‌పై సాంబశివరావు చేసిన ఆరోపణలను అంగీకరిస్తున్నారా అని బీఆర్ఎస్‌ను ప్రశ్నించారు. తెలంగాణలో ప్రత్యామ్నాయం లేకపోవడం వల్లే కాంగ్రెస్ పార్టీకి ప్రజలు ఓటు వేశారని అన్నారు. ఆ లోటును తెలంగాణ జాగృతి భర్తీ చేస్తుందని కవిత పేర్కొన్నారు. బీజేపీ కరీంనగర్‌లో తప్ప ఎక్కడా గెలవలేదని ఎద్దేవా చేశారు. బండి సంజయ్ రూ.30 కోట్లు ఖర్చు చేశారని ఆరోపించారు. తమకు 17 స్థానాలు రావడమే చాలా ఎక్కువ అన్నట్లుగా కేటీఆర్ మాట్లాడటం విచిత్రమని కవిత అన్నారు. గ్రామ పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిబంధనలను ఉల్లంఘించారని మండిపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని సూచించారు.

### వడ్డేపల్లి మున్సిపాలిటీ విజయంపై కవిత

జాగృతి రాజకీయ పార్టీగా మారబోతుందని ప్రకటించిన తర్వాత తమ పార్టీకి చెందిన నాయకులు మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేసి విజయం సాధించారని అన్నారు. తక్కువ సమయంలోనే ప్రజలు తమను ఆదరించారని అన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో తెలంగాణ జాగృతి, ఆలిండియా ఫార్వార్డ్ బ్లాక్ కలిసి పోటీ చేసి అద్భుత విజయాన్ని సాధించాయని అన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో తాము 40 వార్డులు గెలుచుకున్నామని అన్నారు. అధికారికంగా 33 స్థానాల్లో తమ అభ్యర్థులు విజయం సాధించారని, మరో 7చోట్ల సాంకేతిక కారణాల వల్ల స్వతంత్రులుగా గెలిచారని వెల్లడించారు. ముఖ్యంగా వడ్డేపల్లి మున్సిపాలిటీలో తమకు స్పష్టమైన మెజారిటీ వచ్చిందని కవిత వెల్లడించారు. తమ విజయంలో తెలంగాణ జాగృతి ప్రమేయం లేదని ఏఐఎఫ్‌బీ నాయకుడు వడ్డేపల్లి శ్రీనివాసులు నిన్న ప్రకటించారు. అయితే ఈరోజు కవిత ఆలిండియా ఫార్వార్డ్ బ్లాక్ రాష్ట్ర కార్యదర్శి అంబటి బోజిరెడ్డి, హెచ్ఎంఎస్ ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్‌లతో కలిసి మీడియా సమావేశం నిర్వహించడం గమనార్హం. వడ్డేపల్లి మున్సిపాలిటీలో తెలంగాణ జాగృతి, ఏఐఎఫ్‌బీ కలిసి కైవసం చేసుకున్నాయని కవిత స్పష్టం చేశారు.

### కాంగ్రెస్ ఖాతాలోకి వడ్డేపల్లి మున్సిపాలిటీ

జోగులాంబ గద్వాల జిల్లాలోని వడ్డేపల్లి మున్సిపాలిటీ కాంగ్రెస్ ఖాతాలోకి చేరింది. ఆ మున్సిపాల్టీలో గెలిచిన స్వతంత్రులు కాంగ్రెస్‌కు జైకొట్టారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమక్షంలో వారు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వడ్డేపల్లిలో మొత్తం 10 వార్డులు ఉండగా.. ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ (ఏఐఎఫ్‌బీ) 8 స్థానాల్లో గెలుపొందగా.. అధికార కాంగ్రెస్, బీఆర్ఎస్ చేరో ఒక వార్డును గెలుచుకున్నాయి. ఈ మున్సిపాల్టీలో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత మద్దతుదారులు ఫార్వర్డ్ బ్లాక్ నుంచి పోటీచేసి విజయం సాధించారు. కానీ, వీళ్లంతా అధికార కాంగ్రెస్ పార్టీకి జైకొట్టడంతో మున్సిపాలిటీపై హస్తం జెండా ఎగురనుంది. ఒక్క వార్డు గెలిచిన కాంగ్రెస్‌కు స్వతంత్రులంతా మద్దతు ఇవ్వడంతో ఛైర్మన్ పదవి దక్కనుంది. ముఖ్యమంత్రి కార్యాలయానికి వడ్డేపల్లి శ్రీనివాస్‌తో సహా 8 మంది కౌన్సిలర్లు చేరుకున్నారు. వారి వెంట మంత్రి జూపల్లి కృష్ణారావు, నాగర్ కర్నూలు ఎంపీ మల్లు రవి, నియోజకవర్గం ఇంచార్జ్, మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్ ఉన్నారు. వడ్డేపల్లి శ్రీనివాస్, కౌన్సిలర్లు పావని, శారద, మంజుల, యుగేందర్ రెడ్డి, దేవమ్మ, విజయ్ భాస్కర్, జయశ్రీ, తిమ్మప్ప సీఎంను కలిశారు. వారు, మీడియాతో మాట్లాడుతూ.. తాము మున్సిపాలిటీ అభివృద్ధి కోసమే ముఖ్యమంత్రిని లిసినట్లు తెలిపారు. అభివృద్ధికి సహకరిస్తామని రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారని వివరించారు.

## సంజయ్ వర్గానిదే పై'చేయి'

**తన వర్గంతో హైదరాబాద్‌కు. ..**

**జీవన్ రెడ్డి కూడా క్యాంపునకు.. రాజధానికి చేరిన జైతాల ముచ్చట**

జగిత్యాల, ఫిబ్రవరి 14 (ఈవార్తలు): జగిత్యాల మున్సిపల్ చైర్‌పర్సన్ పీఠం విషయంలో ఎమ్మెల్యే సంజయ్ కుమార్, మాజీమంత్రి జీవన్ రెడ్డి క్యాంప్ రాజకీయాలకు తెరతీశారు. జగిత్యాల మున్సిపాలిటీలో 50 స్థానాలు ఉండగా, చైర్‌పర్సన్ పీఠం కైవసం చేసుకోవడానికి అవసరమైన మ్యాజిక్ ఫిగర్ 26. ఇందులో కాంగ్రెస్‌కు 23 స్థానాలు, కాంగ్రెస్ టికెట్ రాకపోవడంతో సంజయ్ వర్గానికి చెందిన ముగ్గురు రెబల్స్ ఇండిపెండెంట్లుగా గెలుపొందారు. వీరితో పాటు ఇద్దరు ఎంఐఎం అభ్యర్థులు, మరో ఇద్దరు బీజేపీ రెబల్స్ కూడా సంజయ్ క్యాంప్‌కు చేరారని సమాచారం. ఇలా లెక్క.. 30 దాటుతుండటంతో మేయర్ పీఠం సంజయ్ వర్గానికే పక్కా అని తెలుస్తోంది. చైర్ పర్సన్ రేసులో తోపారపు లావణ్య, మూలాస్తపు లావణ్య, సమీండ్ల వాణి, అడువాల జ్యోతి పేర్లు వినిపిస్తున్నా.. సంజయ్ తన వర్గానికే దక్కేలా గెలిచిన వారిని హైదరాబాద్‌కు తరలించి క్యాంప్ రాజకీయాలకు తెర లేపారు. శుక్రవారమే వాళ్లంతా క్యాంపునకు చేరారు. అటు.. జీవన్ రెడ్డి కూడా తన వర్గంలోని 14 మంది కౌన్సిలర్లతో శనివారం హైదరాబాద్‌కు చేరుకున్నారు.

## కొత్తగూడెం మేయర్.. కాంగ్రెస్-సీపీఐ

**మొదటి పేజీ తరువాయి**

కార్పొరేషన్‌లో 60 డివిజన్లలో ఈ ఫలితాలు వచ్చాయి. కాంగ్రెస్, సీపీఐ రెండూ సమానంగా 22 సీట్లు గెలవడంతో హంగ్ కౌన్సిల్ ఏర్పడింది. అంటే, ఏ ఒక్క పార్టీకి స్పష్టమైన మెజారిటీ రాలేదు. అయితే ఇక్కడ బీఆర్ఎస్‌కు 8 సీట్లు వచ్చాయి. సీపీఐకి అవసరమైతే బీఆర్ఎస్ మద్దతు ఇస్తుందని కేటీఆర్ ప్రకటించారు కూడా. అయితే మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి స్పందించారు కూడా. సీపీఐ అనేది తమకు మిత్రపక్షమేనని, కాకపోతే ఇక్కడ విడివిడిగా పోటీ చేశామని నిన్ననే క్లారిటీ ఇచ్చారు. దాంతో కొత్తగూడెంలో కాంగ్రెస్-సీపీఐలు కలిసే మేయర్ పీఠాన్ని దక్కించుకుంటాయనే సంకేతాలిచ్చారు. ఈ క్రమంలోనే ఇరు పార్టీల మధ్య పొత్తు కుదరడంతో కొత్తగూడెం కార్పొరేషన్‌లో నెలకొన్న మేయర్ పదవిపై సందిగ్ధత వీడింది.

## ఓటు ఉన్నచోటే ఎక్స్‌అఫీషియో

**క్లారిటీ ఇచ్చిన ఎన్నికల సంఘం**

హైదరాబాద్, ఫిబ్రవరి 14 (ఈవార్తలు): మున్సిపల్ ఎన్నికల ఫలితాల నేపథ్యంలో ఎక్స్‌అఫీషియో ఓటుపై రాష్ట్ర ఎన్నికల సంఘం స్పష్టతనిచ్చింది. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు నియోజకవర్గ పరిధిలో ఎక్స్‌అఫీషియో ఓటు వినియోగించుకోవడం వివరణ ఇచ్చింది. ఎమ్మెల్సీలు, ఎంపీలు తమ నియోజకవర్గ పరిధిలోని ఏదైనా ఒక మున్సిపాలిటీలో ఎక్స్‌అఫీషియో ఓటు వినియోగించుకోవచ్చని రాష్ట్ర ఎన్నికల సంఘం తెలిపింది. అదే ఎమ్మెల్సీలు, రాజ్యసభ సభ్యులు అయితే ఓటు ఉన్న మున్సిపాలిటీలోనే ఎక్స్‌అఫీషియో ఓటు వినియోగించుకోవాలని సూచించింది. మున్సిపల్ ఎన్నికల ఫలితాల్లో అధికార కాంగ్రెస్ పార్టీ కేవలం సగం మున్సిపాలిటీలను మాత్రమే దక్కించుకుంది. రాష్ట్రంలోని 116 మున్సిపాలిటీల్లో కేవలం 66 మున్సిపాలిటీలకే పరిమితమైంది. ఏడు కార్పొరేషన్లలో 3 మాత్రమే దక్కించుకుంది. ఫలితంగా 36 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్లలో హంగ్ ఏర్పడింది. ఈ క్రమంలో హంగ్ ఏర్పడిన మున్సిపాలిటీల్లో స్వతంత్రులతో పాటు ఎక్స్‌అఫీషియో ఓటు కీలకంగా మారింది.

## ఐఏఎస్ అరవింద్ విచారణకు కేంద్రం ఓకే

**ఫార్ములా-ఈ కార్ రేస్ కేసులో కీలక పరిణామం**

### ఛార్జ్‌షీట్‌కు ఏసీబీ రంగం సిద్ధం!

హైదరాబాద్, ఫిబ్రవరి 14 (ఈవార్తలు): ఫార్ములా-ఈ కార్ రేసు కేసు కీలక మలుపు తిరిగింది. సీనియర్ ఐఏఎస్ అధికారి అరవింద్ కుమార్‌ను ప్రాసిక్యూషన్ చేసేందుకు కేంద్ర ప్రభుత్వం నుంచి అధికారికంగా అనుమతి లభించింది. ప్రాసిక్యూషన్ విషయంపై రాష్ట్రానికి కేంద్రం సమాచారం ఇచ్చింది. ఫార్ములా-ఈ రేసింగ్ ఒప్పందాల్లో నిబంధనల ఉల్లంఘన జరిగిందని తెలంగాణ అవినీతి నిరోధక శాఖ గతంలోనే కేసు నమోదు చేసిన సంగతి తెలిసిందే. ఫార్ములా-ఈ కార్ రేస్ కేసులో కేటీఆర్‌ని విచారించడానికి గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అనుమతి ఇచ్చిన విషయం తెలిసిందే. తాజాగా అరవింద్ కుమార్ విషయంలో కేంద్రం అనుమతి ఇవ్వడంతో.. ఇప్పుడు ఏసీబీ ఆయనపై కోర్టులో ఛార్జ్‌షీట్ దాఖలు చేసేందుకు పూర్తి స్వేచ్ఛ పొందింది.

## తెలంగాణ తల్లికి పాదాభివందనం

**జనసేన అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్**

హైదరాబాద్, ఫిబ్రవరి 14 (ఈవార్తలు): తెలంగాణ మున్సిపల్ ఎన్నికల ఫలితాలపై జనసేన పార్టీ అధ్యక్షుడు, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్పందించారు. శనివారం సాయంత్రం సోషల్ మీడియా వేదికగా ప్రకటన విడుదల చేశారు. 'తెలంగాణలో ఉద్భవించిన పార్టీ జనసేన. ఈరోజు విజయలక్ష్మి రూపంలో తొలి అడుగుపడింది. పార్టీ తొలినాళ్ళు గుర్తు చేసుకొంటే దారంతా గతుకులు.. భవిష్యత్తు ఏమిటనే ప్రశ్న. చిన్నపాటి ఆసరా కూడా లేదు. మిణుకుమిణుకుమనే ఆశ. పార్టీ సిద్ధాంతాలను విశ్వసించిన- వీర మహిళలు ఝాన్సీ లక్ష్మీభాయి స్ఫూర్తిని నింపుకొని.. ఉద్యమ స్ఫూర్తితో జనసైనికులు ఎలాంటి ఒడిదుడుకులనైనా తట్టుకొనేందుకు సంసిద్ధులయ్యారు. తెలంగాణలోని వీర మహిళలు, జనసైనికులు పురపాలక ఎన్నికలకు సన్నద్ధమయ్యారు. 2998 స్థానాలున్న మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో జనసేన 332 చోట్ల పోటీ చేసింది. ఒక కౌన్సిలర్ స్థానం, ఒక కార్పొరేటర్ స్థానం జనసేనకు దక్కాయి. మహా వృక్షమైనా చిన్న విత్తు నుంచే నేల పొరలను చీల్చుకొని మొలక వేస్తుంది. విశ్వ విజేత కూడా తల్లి గర్భంలో అణువంతే ఉంటాడు. కోటి రతనాల వీణ తెలంగాణలో జనసేన విజయ ప్రయాణం లేలేత అడుగులతో మొదలైంది. నేరేడుచర్ల మున్సిపాలిటీలో ఆరూరి విజయలక్ష్మి, మంచిర్యాల కార్పొరేషన్‌లో అగ్గు సాగర్ జనసేన అభ్యర్థులుగా సాధించిన విజయాలు భవిష్యత్తు ప్రస్థానానికి బలమైన స్ఫూర్తిని అందిస్తాయి. విజయలక్ష్మి, సాగర్ లకు మనస్ఫూర్తిగా అభినందనలు తెలియచేస్తున్నాను. జనసేన తెలంగాణ వీర మహిళలు, జనసేన సైనికులు, నాయకులకు అభినందనలు. పార్టీ ఉద్భవించిన నేలపై దక్కిన తొలి విజయం ఇది. పోరాట పటిమను.. సంస్కృతి సంప్రదాయాల శక్తిని.. సాహితీ సౌరభాన్ని.. అణువణువునా నింపుకున్న తెలంగాణ నేల తల్లికి హృదయపూర్వక పాదాభివందనాలు' అని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.



## ఏపీ బడ్జెట్ రూ.3,32,205 కోట్లు

**మొదటి పేజీ తరువాయి**

రైతుల కలలను సాకారం చేసేలా ప్రాధాన్యత ఇచ్చామన్నారు. పెట్టుబడి దారులకు అనుకూల వాతావరణం కల్పించామని ఆర్థిక మంత్రి వివరించారు. కీలక రంగాలకు కేటాయింపులు భారీగా పెంచారు.

### శాఖల వారీగా కేటాయింపులు

- వ్యవసాయ శాఖ కు రూ 11,745 కోట్లు
- పాఠశాల విద్య కు రూ 32, 208
- బీసీ సంక్షేమం రూ 23650 కోట్లు
- ఇంధన శాఖ- 19,306 కోట్లు
- పంచాయితీ రాజ్ కు రూ 22,941 కోట్లు
- ఇరిగేషన్ 18,223 కోట్లు
- అన్నదాత సుఖీభవ కోసం రూ 6,600 కోట్లు
- మత్స్యకార సేవకు 600 కోట్లు
- ధరల స్థిరీకరణ కు రూ 560 కోట్లు
- మనబడి- మన భవిష్యత్ పథకానికి రూ. 1,500 కోట్లు
- పీఎం స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియాకు రూ. 707 కోట్లు
- సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర పథకానికి రూ. 654 కోట్లు
- యూత్ అండ్ స్పోర్ట్స్‌కు రూ. 438 కోట్లు
- సాగు నీటి ప్రాజెక్టులు: రూ. 9,906 కోట్లు
- రాష్ట్రీయ కృషి వికాస్ యోజన: రూ. 1,927 కోట్లు
- అన్నదా సుఖీభవ: రూ. 6,600 కోట్లు
- మత్స్యకారులకు రూ. 260 కోట్లు
- పోలవరం: రూ. 6,105 కోట్లు
- ధరల స్థిరీకరణ నిధి: రూ. 500 కోట్లు
- పాఠశాల విద్యకు రూ. 32,308 కోట్లు
- వైద్య ఆరోగ్య శాఖకు రూ. 19,306 కోట్లు
- బీసీ సంఘాల కోసం రూ. 23,650 కోట్లు
- జల వనరుల శాఖకు రూ. 18,223 కోట్లు
- పంచాయతీ రాజ్ కు రూ. 22,941 కోట్లు
- మున్సిపల్ శాఖకు రూ. 14,538 కోట్లు

# కరీంనగర్‌లో బీజేపీ బలం 34

## పార్టీలో చేరిన ఐదుగురు ఇండిపెండెంట్లు

కరీంనగర్, ఫిబ్రవరి 14 (ఈవార్తలు): కరీంనగర్ మున్సిపల్ కార్పోరేషన్‌లో 66 డివిజన్లలో 30 సీట్లు గెల్చుకుని బీజేపీ.. అతి పెద్ద పార్టీగా అవతరించింది. కానీ, మేయర్, డిప్యూటీ మేయర్ సీట్లు దక్కించుకోవాలంటే 34 సీట్లు అవసరం. ఎక్స్ అఫీషియో మెంబర్లుగా ఎంపీ బండి సంజయ్, ఎమ్మెల్సీలు మల్క కొమురయ్య, అంజిరెడ్డిల ఓట్లతో బీజేపీ బలం 33కి చేరింది. ఇప్పటికే మరో ఐదుగురు ఇండిపెండెంట్స్ బీజేపీలో చేరికతో కరీంనగర్ బల్దియాపై కాషాయ జెండాను రెపరెపలాడించేందుకు బీజేపీకి లైన్ క్లియర్ అయ్యింది. కరీంనగర్‌లో 30 స్థానాలు గెలుచుకుని బీజేపీ పూర్తి ఆధిక్యత ప్రదర్శించింది. కాంగ్రెస్ 14, బీఆర్ఎస్ 9 స్థానాలకు పరిమితమవడంతో మేయర్ పీఠం బీజేపీ వశమవడంనల్లేరు మీద నడకలా ఉంది. ఉమ్మడి జిల్లాలో 13 మున్సిపాలిటీలు, 2 కార్పొరేషన్లకు ఎన్నికలు పూర్తయ్యాయి. రాయికల్, మెట్‌పల్లి, జమ్మికుంటలో హంగ్ వాతావరణం కనిపిస్తోంది. ఇలాంటి చోట్ల ఎక్స్‌అఫిషియో ఓట్లు కీలకం కానున్నాయి. ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు వారి నియోజకవర్గపరిధిలోని మున్సిపాలిటీలో ఎక్స్‌అఫిషియో ఓటుహక్కు కలిగి ఉంటారు. తన పరిధిలో రెండు మూడు మున్సిపాలిటీ ఉంటే.. ఎక్కడ అవసరమో అక్కడ ముందే నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. పార్టీలకు స్పష్టమైన మెజారిటీ రాని సమయంలో వీరి ఓటు కీలకమవుతుంది. తాజాగా పాత కరీంనగర్ జిల్లాలో ఎక్స్‌అఫిషియో ఓట్లపై జోరుగా చర్చ సాగుతోంది.

కరీంనగర్‌లో అతిపెద్ద పార్టీగా బీజేపీ అవతరించినప్పటికీ.. మేజిక్ ఫిగర్ చేరుకోలేదు. అవసరాన్ని బట్టి 10 మంది ఇండిపెండెంట్ కార్పొరేటర్లతోపాటు, ఎక్స్‌అఫిషియో ఓట్లు వినియోగించుకునేందుకు బీజేపీ సిద్ధంగా ఉంది. అన్ని పార్టీలు తమ అమ్ముల పొదిలో దాచిన ఈ ఓట్లను అవసరాన్ని బట్టి వినియోగించనున్నాయి. బీజేపీకి కేంద్ర మంత్రి బండి సంజయ్‌తో పాటు ఇద్దరు ఎమ్మెల్సీలు చిన్నమైల్ అంజిరెడ్డి, మల్క కొమురయ్య ఓట్లు ఉండగా.. కాంగ్రెస్‌కు ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ కరీంనగర్‌లో, మేడిపల్లి సత్యం చొప్పదండిలో, ఆది శ్రీనివాస్ వేములవాడలో, మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ధర్మపురిలో, మంత్రి శ్రీధర్‌బాబు మంథనిలో, హుస్నాబాద్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్, విజయరమణారావు పెద్దపల్లి, సుల్తానాబాద్‌లో, రామగుండంలో మక్కాన్‌సింగ్ ఓట్లు వినియోగించుకునే అవకాశముంది. వీరే కాకుండా కాంగ్రెస్ ఎమ్మెల్సీలు బల్మూరి వెంకట్, భానుప్రసాద రావు ఉన్నారు. బీఆర్ఎస్‌కు గంగుల కమలాకర్, కేటీఆర్, కోరుట్లలో సంజయ్, హుజూరాబాద్‌లో పాడి కౌశిక్ రెడ్డి, ఎమ్మెల్సీ ఎల్.రమణ ఓట్లు అందుబాటులో ఉన్నాయి.






# పట్టభద్రుల పండుగ..

**అట్టహాసంగా లా కాలేజ్ స్నాతకోత్సవ వేడుకలు**

**అనంత రాజమ్మ బంగారు స్మారక పతకాల ప్రదానం**

**అడ్వొకేట్‌లో టెక్నాలజీని వాడుకోవాలి: ఓయూ వీసీ**

# 'అనంత' ఆనందాలు!

హైదరాబాద్, ఫిబ్రవరి 14 (ఈవార్తలు): ఇంటర్నల్స్.. సెమిస్టర్ పరీక్షలు.. ఇంటర్న్‌షిప్.. మూట్ కోర్టులు.. కోర్టు విజిట్స్.. ఇలా ఏళ్ల పాటు న్యాయ విద్యను అభ్యసించడం ఒక ఎత్తు. ఆ కష్టానికి 'సర్టిఫికెట్' అనే ప్రతిఫలం మరో ఎత్తు. ఆ సందర్భాన్ని గొప్పగా సెలబ్రేట్ చేసుకుంటే వచ్చే ఆనందమే వేరు. ఆ ఆనందాన్ని గొప్పగా సెలబ్రేట్ చేసుకున్నారు అనంత లా కాలేజీ విద్యార్థులు. శనివారం హైదరాబాద్‌లోని ఆర్టీసీ కల్యాణ మండపంలో అనంత లా కాలేజీ గ్రాడ్యుయేషన్ సెరిమనీ అట్టహాసంగా జరిగింది. మూడేళ్లు, ఐదేళ్ల విద్యను అభ్యసించిన విద్యార్థులు అతిథుల చేతుల మీదుగా సర్టిఫికెట్ అందుకొని సంబురపడ్డారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఉస్మానియా యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కుమార్ మొలుగారం, ఉస్మానియా లా కాలేజీ డీన్ ప్రొఫెసర్ ఎన్ వెంకటేశ్వర్లు, అనంత లా కాలేజీ చైర్మన్ రవి అనంత పాల్గొన్నారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కాన్వొకేషన్‌లో భాగంగా కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎంవీ చంద్రమతి రూపొందించిన న్యూస్ లెటర్‌ను ఆవిష్కరించారు. అనంతరం అతిథులు మాట్లాడుతూ పట్టభద్రులకు మార్గదర్శనం చేశారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు అనంత రాజమ్మ మెమోరియల్ బంగారు, వెండి పతకాలను వీసీ అందజేశారు. ఇతర విద్యార్థులకు డీన్ స్నాతక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా కాలేజీ ప్రిన్సిపాల్ చంద్రమతి మాట్లాడుతూ.. కాలేజీ సాధించిన విజయాలు, పట్టభద్రులకు న్యాయవాద వృత్తిలో ఉన్న మెరుగైన అవకాశాలను వివరించారు. కార్యక్రమంలో కాలేజీ యాజమాన్యం, అధ్యాపకులు, విద్యార్థులు, విద్యార్థుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.




## టెక్నాలజీని అందిపుచ్చుకోవాలి

ఏఐ అన్ని రంగాలను ఆవరించింది. అందుకు న్యాయ విద్య మినహాయింపు కాదు. ఇలాంటి సందర్భాలు న్యాయవాదులకు సవాల్ విసురుతాయి. న్యాయవిద్యకు టెక్నాలజీని జోడించాలి. దాన్నుంచి మరింత మెరుగైన సమాచారాన్ని సేకరిస్తూ, ముందుకెళ్లాలి. కాలేజీలు నూతన పద్ధతులో విద్య బోధన అందించి విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దాలి. అనంత లా కాలేజీ నుంచి పట్టభద్రులుగా వెళ్తున్న విద్యార్థులంతా సమాజంలో ఉన్నతంగా న్యాయ సేవలు అందించాలి.

**- ప్రొఫెసర్ కుమార్ మొలుగారం, ఓయూ వీసీ**

## ఎంత ఎదిగినా తల్లిదండ్రులను మరువొద్దు

విద్యార్థి జీవితాన్ని పూర్తి చేసుకొని రేపటి నుంచి న్యాయవాద వృత్తిలోకి వెళ్తున్న వారందరికీ అభినందనలు. రేపటి నుంచే అసలు సవాల్ మొదలవుతుంది. సమాజంతో పోటీ పడి వృత్తిలో రాణించాలి. క్లయింట్లతో మెలిగే పద్ధతి, వారికి ఎలాంటి సేవలు అందిస్తున్నామనేదే ముఖ్యం. న్యాయవాదులు అందించే సేవను బట్టి సమాజంలో హోదా, ఆర్థిక స్థితిగతులు ఆధారపడి ఉంటాయి. ముఖ్యంగా ఇప్పటి వరకు మీరు (విద్యార్థులు) ఈ స్థాయికి రావడానికి కృషి చేసిన తల్లిదండ్రులను అస్సలు మరువొద్దు.

**- ప్రొఫెసర్ వెంకటేశ్వర్లు, ఓయూ లా కాలేజీ డీన్**

## అత్తాపూర్‌లో న్యాయవాది హత్య



మెహదీపట్నం/హైదరాబాద్, ఫిబ్రవరి 14 (ఈవార్తలు: హైదరాబాద్‌లోని అత్తాపూర్‌లో దారుణం చోటు చేసుకుంది. సులేమాన్ నగర్‌లో సొంత ఆఫీసులో న్యాయవాది మహమ్మద్ ఖదీర్ పనిచేసుకుంటుండగా అతడిపై దుండగులు కత్తులతో దాడి చేసి చంపి పారిపోయారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్లూస్ టీమ్ సహకారంతో ఆధారాలు సేకరించారు. కుటుంబ విభేదాల కోణంలో బామ్మర్దులపై అనుమానం వ్యక్తం చేశారు.సీసీ టీవీ ఫుటేజ్ ఆధారంగా నిందితుల కోసం ప్రత్యేక బృందాలు గాలింపు చర్యలు మొదలు పెట్టారు.హత్యకు గల అసలు కారణాలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## ఓయూ విద్యార్థులపై కేసులు

హైదరాబాద్, ఫిబ్రవరి 14 (ఈవార్తలు): ఓయూ క్యాంపస్‌లో తన తల్లికి అవమానం జరిగిందని నిరసన తెలిపిన విద్యార్థులకు యూనివర్సిటీ పోలీసులు షాక్ ఇచ్చారు. హాస్టల్ యాజమాన్యం విద్యార్థిని తల్లిని అవమానించారని ఆరోపిస్తూ నిరసన తెలిపిన విద్యార్థులపై పోలీసులు కేసులు పెట్టినట్లు తెలుస్తుంది. దీంతో సదరు విద్యార్థులు ఒక్కసారిగా షాక్ అయ్యారు. పోలీసులు, హాస్టల్ సిబ్బంది తీరుపై తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఈ నెల 11న రాత్రి తన బిడ్డను చూడటానికి దూర ప్రాంతం నుంచి వచ్చిన ఒక విద్యార్థిని తల్లిని కనీసం రాత్రి వేళ కూడా ఉండనివ్వకుండా, మానవత్వం లేకుండా బయటకు పంపే ప్రయత్నం చేయడం తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. పనులు ముగించుకుని చీకటి పడే సమయానికి వచ్చిన సదరు తల్లిని అవమానించడం పై ఆగ్రహం వ్యక్తం చేస్తూ, విద్యార్థినులు రాత్రి సమయం అని కూడా చూడకుండా రోడ్డుపైకి వచ్చి భారీ నిరసన చేపట్టారు. "సొంత బిడ్డల వద్దకు వచ్చే తల్లిదండ్రులకే గౌరవం లేని చోట మేం ఎలా చదువుకోవాలి?" అని నిలదీస్తూ డైరెక్టర్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని, ఆమెనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన రాత్రి నుంచి 12న తేదీ ఉదయం వరకు కొనసాగింది. ఈ క్రమంలో విద్యార్థుల ఆందోళనకు న్యాయమైన పరిష్కారం చూడాల్సింది పోయి, శాంతియుతంగా నిరసన తెలుపుతున్న వారిపై పోలీసులు కేసులు నమోదు చేయడం గమనార్హం. తల్లిదండ్రులు వచ్చినప్పుడు కనీసం ఒక అకామిడేషన్ ఏర్పాటు చేయాలన్న కనీస విజ్ఞప్తిని కూడా తిరస్కరించడం పై విద్యార్థి సంఘాలు మండి పడుతున్నాయి.

## బీఆర్‌ఎస్‌లో చేరిన కాంగ్రెస్ కౌన్సిలర్లు

**బెల్లంపల్లిలో ఆసక్తికర ఘటన**

**బీఆర్‌ఎస్‌తో కలిసి పనిచేస్తానన్న బీజేపీ కౌన్సిలర్**

మంచిర్యాల, ఫిబ్రవరి 14 (ఈవార్తలు): తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల ఫలితాల్లో 30కి పైగా మున్సిపాలిటీలలో హంగ్ ఏర్పడిన నేపథ్యంలో అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్‌ఎస్ ఆయా చోట్ల చైర్మన్ పదవులను దక్కించుకోవడానికి అన్ని రకాల ప్రయత్నాలు చేస్తున్నాయి. ఈ క్రమంలో బెల్లంపల్లి మున్సిపాలిటీలో ఆసక్తికర పరిణామం చోటు చేసుకుంది. ఇక్కడ మొత్తం 34 వార్డులు ఉండగా కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలు చెరో 14 స్థానాలు కైవసం చేసుకున్నాయి. బీజేపీ ఒకటి, ఇతరులు 5 స్థానాలు దక్కించుకున్నారు. ఛైర్మన్, వైస్ ఛైర్మన్ పదవులు దక్కించుకోవడానికి కాంగ్రెస్, బీఆర్‌ఎస్ స్వతంత్రులతో చర్చలు జరుపుతున్న క్రమంలో ముగ్గురు కౌన్సిలర్లు బీఆర్‌ఎస్ పార్టీలో చేరడం గమనార్హం. కాంగ్రెస్ పార్టీకి చెందిన 26వ వార్డు కౌన్సిలర్ ఇప్పకుమార్ స్వామి, కాంగ్రెస్ రెబల్‌గా పోటీ చేసి గెలిచిన 30వ వార్డు కౌన్సిలర్ సుఖేషిణి భరద్వాజ్, 34వ వార్డు బీజేపీ కౌన్సిలర్ కొక్కుల రామ్మూర్తి బీఆర్‌ఎస్‌లో చేరారు. 30 వార్డు కౌన్సిలర్, 26వ వార్డు కౌన్సిలర్‌లు అధికారికంగా బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. కేటీఆర్ వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. 34వ వార్డు బీజేపీ అభ్యర్థి మాత్రం అధికారికంగా చేరనప్పటికీ, బీఆర్‌ఎస్ విధానాలకు ఆకర్షితుడనై మద్దతు ప్రకటిస్తున్నట్లు చెప్పారు. ఈ ముగ్గురితో బీఆర్‌ఎస్ పార్టీ బలం 17కు చేరుకుంది.

# జీహెచ్ఎంసీ ఎన్నికల్లోనూ పోటీచేస్తాం

**తెలంగాణ జనసేన ప్రకటన**




హైదరాబాద్, ఫిబ్రవరి 14 (ఈవార్తలు): తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల్లో రెండు చోట్ల గెలవడం సంతోషకరమని, జీహెచ్ఎంసీ ఎన్నికల్లోనూ పోటీ చేస్తామని జనసేన పార్టీ తెలంగాణ విభాగం ప్రకటించింది. మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికల ఫలితాల్లో జనసేన ఉనికిని చాటుకున్న విషయం తెలిసిందే. ఆ పార్టీ రెండు చోట్ల విజయం సాధించింది. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర నాయకులు మీడియా సమావేశం నిర్వహించారు. జనసేన పార్టీ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బొంగునూరి మహేందర్ రెడ్డి మాట్లాడుతూ, మున్సిపల్ ఎన్నికలలో 330 పైగా అభ్యర్థులు పోటీలో నిలిచారని తెలిపారు. మంచిర్యాల్ కార్పొరేషన్‌లో 34వ డివిజన్ నుండి జనసేన కార్పొరేటర్ అభ్యర్థి అగ్గు సాగర్ 31 ఓట్ల మెజార్టీతో, సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మున్సిపాలిటీలో 14వ వార్డు నుండి 29 ఓట్ల మెజారిటీతో ఆరూరి విజయలక్ష్మి నాగేశ్వరరావు విజయం సాధించారని తెలిపారు. మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికలలో పార్టీకి ఓటేసిన ప్రజలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఈ ఎన్నికల కోసం పార్టీ నాయకులు, పార్టీ శ్రేణులు, వీర మహిళలు అందరూ ఎంతో కష్టపడి పనిచేశారని అన్నారు. తక్కువ సమయంలోనే పార్టీ గెలుపు కోసం ఎంతో శ్రమించిన వారందరికీ ఆయన పవన్ కల్యాణ్ తరఫున, రాష్ట్ర నాయకుల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ పార్టీ ఇన్‌ఛార్జ్ నేమూరి శంకర్ గౌడ్ మాట్లాడుతూ, రెండు చోట్ల గెలవడం సంతోషకరమని అన్నారు. ఇదే స్ఫూర్తితో రాబోయే ఎన్నికల్లోనూ పోటీ చేస్తామని తెలిపారు. తెలంగాణ ఉద్యమం స్ఫూర్తితో పవన్ కల్యాణ్ పార్టీని స్థాపించారని పార్టీ రాష్ట్ర నాయకులు రాజలింగం అన్నారు. పవన్ కల్యాణ్ ఆశయాలను, పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి బలంగా తీసుకువెళ్లాలని పిలుపునిచ్చారు. జీహెచ్ఎంసీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేస్తామని అన్నారు. పార్టీని మరింత బలోపేతం చేస్తామని సీనియర్ నాయకుడు ఆర్కే సాగర్ అన్నారు. తెలంగాణలో జనసేన బోణీ కొట్టిందని మరో నాయకుడు ప్రేమ్ కుమార్ హర్షం వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో మరింత ఉత్సాహంగా పనిచేస్తామని అన్నారు.

# బండి సంజయ్‌ది అర్జునుడి పాత్ర

**నిజామాబాద్ ఎంపీ అర్వింద్ ప్రశంసలు**

**కాంగ్రెస్ బలమైన ప్రభుత్వమేమీ కాదన్న ఎంపీ**



నిజామాబాద్, ఫిబ్రవరి 14 (ఈవార్తలు): బండి సంజయ్ ఒక వారియర్ అని, ఆయన అర్జునుడి పాత్రకు ఫిట్ అవుతారని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ అన్నారు. నిజామాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ, రాష్ట్రంలో కాంగ్రెస్ బలమైన ప్రభుత్వమేమీ కాదని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బలమైన స్థాయిలో ఏమీ లేరని వ్యాఖ్యానించారు. మున్సిపల్ వార్డు సభ్యులు, కార్పొరేటర్లను బలవంతంగా ఎత్తుకెళ్తే బీఆర్‌ఎస్‌కు పట్టిన గతే కాంగ్రెస్‌కు పడుతుందని హెచ్చరించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ప్రజలు ఇప్పటికే ఛీకొడుతున్నారని, ఇప్పుడు కార్పొరేటర్లను ఎత్తుకెళితే మరింత ఛీకొడతారని అన్నారు. నిజామాబాద్ కార్పొరేషన్ ఫలితాల్లో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీల కంటే ఎక్కువ స్థానాలు గెలుచుకున్నామని అన్నారు. తన పార్లమెంట్ పరిధిలో కూడా బీఆర్‌ఎస్ కంటే ఎక్కువ సీట్లను గెలుచుకున్నామని ధర్మపురి అరవింద్ వెల్లడించారు. కాంగ్రెస్ లౌకిక వాద పార్టీ కాదని, ఓ బ్రోకర్ పార్టీ అని దుయ్యబట్టారు. ప్రభుత్వం పోలీసు శాఖను దుర్వినియోగం చేస్తోందని ఆరోపించారు. తమ పార్టీ అభ్యర్థులను పోలింగ్ బూత్‌ల నుంచి పంపించినందుకు నేనే వారిపై కేసు పెట్టాలని ఆయన అన్నారు. కానీ పోలీసులే తనపై కేసు పెట్టారని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలని పోలీసులు చెప్పారని ఆరోపించారు. బీఆర్‌ఎస్ కార్పొరేటర్లను ఎత్తుకెళ్లడానికి కాంగ్రెస్ పార్టీకి పోలీసులు సహకరిస్తున్నారని విమర్శించారు. రాజకీయాలను భ్రష్టు పట్టించారనే కేసీఆర్‌ను తెలంగాణ ప్రజలు ఓడించారని, ఇప్పుడు రేవంత్ రెడ్డి అదే దారిలో నడుస్తున్నారని మండిపడ్డారు. రాజకీయాల్లో హుందాతనం ముఖ్యమని అన్నారు. ఎవరికి మద్దతు ఇవ్వాలనేది కార్పొరేటర్లు నిర్ణయించుకుంటారని తెలిపారు. కానీ బలవంతంగా ఎత్తుకెళ్లడం సరికాదని అన్నారు. కరీంనగర్‌లోను బండి సంజయ్ ఆధ్వర్యంలో మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటిందని ప్రశంసించారు.

# ఇక గోవాకు ఫాస్ట్‌గా!

**3,175 కోట్లతో మహబూబ్‌నగర్-గుడబెల్లూరు రోడ్డు**

**కొత్త 4 లైన్ హైవేకు కేంద్రం గ్రీన్ సిగ్నల్**



న్యూఢిల్లీ/మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 14 (ఈవార్తలు): తెలంగాణలో మరో కొత్త హైవే అందుబాటులోకి రానుంది. మహబూబ్‌నగర్ నుంచి కర్ణాటక సరిహద్దు గుడబెళ్లూరు వరకు చేపట్టనున్న 4 లైన్ల జాతీయ రహదారి ప్రాజెక్టుకు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ హైవే నిర్మాణానికి రూ.3,175 కోట్ల నిధుల విడుదలకు పచ్చజెండా ఊపింది. కేంద్ర కేబినెట్ భేటీలో మహబూబ్‌నగర్– గుడబెళ్లూరు 4 లైన్ల హైవే నిర్మాణానికి రూ.3,175 కోట్ల నిధుల చేసేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. మొత్తంగా రూ. 1.60 లక్షల కోట్ల విలువైన ప్రాజెక్టులకు కేబినెట్ భేటీలో ఆమోదం తెలిపారు.ఇక మహబూబ్‌నగర్– గుడబెళ్లూరు ప్రాజెక్టు హైదరాబాద్ – గోవా ఎకనామిక్ కారిడార్‌లో భాగంగా ఉంది. దీనివల్ల హైదరాబాద్ నుంచి రాయచూర్, మంత్రాలయం, మరియు గోవా వెళ్లే ప్రయాణికులకు ప్రయాణ సమయం గణనీయంగా తగ్గుతుంది. రూ.3,175 కోట్ల వ్యయంతో 80.01 కిలోమీటర్లు హ్యామ్ విధానంలో జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ ఈ ప్రాజెక్టు చేపట్టనుంది. ఈ రహదారి మహబూబ్‌నగర్ నుంచి మొదలై.. దేవరకద్ర, మరికల్, మఖ్తల్, మాగనూరు మీదుగా గూడెబల్లూరు ( రాయచూర్ సరిహద్దు) వరకు సాగుతుంది. ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా ఉండటానికి మహబూబ్‌నగర్, దేవరకద్ర, మరికల్, మఖ్తల్, మరియు మాగనూరు పట్టణాల వద్ద ప్రత్యేకంగా బైపాస్ రోడ్లను నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ఉన్న 2 లైన్ల రోడ్డును 4 లైన్లుగా మార్చడం వల్ల ప్రయాణ సమయం దాదాపు 1.5 గంటలు తగ్గుతుంది. నారాయణపేట, మహబూబ్‌నగర్ జిల్లాల ఆర్థిక అభివృద్ధికి ఇది ఎంతో దోహదపడుతుంది. హైదరాబాద్ నుంచి గోవా వెళ్లే వారికి ఇది అత్యంత వేగవంతమైన మార్గంగా మారుతుంది. ఈ ప్రాజెక్టుకు సంబంధించి కేంద్ర క్యాబినెట్ ఆమోదం లభించగా.. టెండర్ల ప్రక్రియ కూడా ప్రారంభం కానుంది. భూసేకరణకు సంబంధించిన నష్టపరిహారం చెల్లింపులు కూడా జరుగుతున్నాయి. ఇక రాష్ట్రంలో మరికొన్ని రోడ్డు ప్రాజెక్టులు కూడా ప్రారంభ దశలో ఉన్నాయి. మన్ననూరు– శ్రీశైలం ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణ పనులు కూడా ప్రారంభం కానున్నాయి. శ్రీశైలం ఆలయానికి దగ్గరగా ఈ కారిడార్ నిర్మించనున్నారు. దీంతో శ్రీశైలం వెళ్లే వారికి సమయంతో పాటు దూరం తగ్గనుంది.

## నిజామాబాద్, కరీంనగర్ కార్పొరేషన్లను మావే

కైవసం చేసుకుంటాం:

మహేశ్ కుమార్ గౌడ్

హైదరాబాద్, ఫిబ్రవరి 14 (ఈవార్తలు): మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సత్తా చాటిన సంగతి తెలిసిందే. ఎన్నికల ఫలితాలపై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ సంతృప్తిని వ్యక్తం చేశారు. నిజామాబాద్, కరీంనగర్ కార్పొరేషన్లను కూడా తామే కైవసం చేసుకుంటామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కొత్తగూడెం కార్పొరేషన్ విషయంలో సరైన నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో సమావేశమవుతానని, ఈ భేటీలో కార్పొరేషన్లపై చర్చించి తుది నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. ఈ ఎన్నికలు కల్వకుంట్ల కవితకు సంతోషాన్ని ఇచ్చి ఉండవచ్చని మహేశ్ గౌడ్ అన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ రోజురోజుకు పతనమవుతోందని... రాబోయే రోజుల్లో ఆ పార్టీ ప్రభావం ఉండదని చెప్పారు. మతాన్ని రెచ్చగొట్టినా మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ ఏమీ సాధించలేకపోయిందని ఎద్దేవా చేశారు. జీహెచ్ఎంసీ ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. మరోవైపు, ఈ ఎన్నికల ఫలితాలతో రేవంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీలో తన పట్టును మరింత పెంచుకున్నారని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

## నెలాఖరులో అకాల వర్షాలు

హైదరాబాద్, ఫిబ్రవరి 14 (ఈవార్తలు): తెలంగాణ ప్రజలకు వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. వింటర్ సీజన్ దాదాపుగా ముగిసింది. ఇక ఎండాకాలం మొదలుకానుంది. కొన్ని రోజుల పాటు పగటి ఉష్ణోగ్రతలు 33 డిగ్రీలు, నైట్ టెంపరేచర్లు 17–19 డిగ్రీలు ఉంటాయని వాతావరణ శాఖ తెలిపింది. క్రమంగా ఉష్ణోగ్రతల్లో భారీ పెరుగుదల ఉంటుందన్నారు. అలాగే ఫిబ్రవరి 25–28 మధ్య ఉరుములు, మెరుపులతో కూడిన అకాల వర్షాలు కురుస్తాయని పేర్కొంటున్నారు. ఇక, ఏపీలో ఉత్తర, దక్షిణ కోస్తాంధ్రాలో ఇవాళ, రేపు పొడి వాతావరణం.. అలాగే పొగమంచు ఒకట్రెండు చోట్ల కురిసే అవకాశముందన్నారు. అలాగే ఎల్లుండి అంతా పొడి వాతావరణం ఏర్పడే అవకాశముందని చెప్పారు. రాయలసీమలో కూడా మూడు రోజులు పొడి వాతావరణం ఉండటంతో పాటు, పొగమంచు కురుస్తాయని వాతావరణ శాఖ చెప్పింది. అటు రాగల 2 రోజుల్లో ఉత్తర కోస్తా ఆంధ్రప్రదేశ్, యానాంలలో కనిష్ట ఉష్ణోగ్రతలు సాధారణముకంటే 2–3 డిగ్రీల సెంటిగ్రేడ్ తక్కువగా.. రాయలసీమలో కనిష్ట ఉష్ణోగ్రతలు సాధారణముకంటే 2–4 డిగ్రీల సెంటిగ్రేడ్ తక్కువగా నమోదయ్యే అవకాశముంది.

# రాజన్న ఆలయ పనుల్లో వేగం పెరగాలి

**సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీనివాస్ రాజ్ ఆదేశాలు**



వేములవాడ, ఫిబ్రవరి 14 (ఈవార్తలు): వేములవాడ రాజన్న ఆలయ విస్తరణ పనుల్లో వేగం పెంచాలని సీఎం ప్రిన్సిపల్ సెక్రెటరీ కే ఎస్ శ్రీనివాస్ రాజ్ ఆదేశించారు. శనివారం వేములవాడ పర్యటనకు వచ్చిన ఆయన రాజన్న సిరిసిల్ల ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ తో కలిసి రాజన్న ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి, విస్తరణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి పలు సూచనలు చేశారు. రాజన్న ఆలయ విస్తరణ, అభివృద్ధి పనులను ఒక ప్రణాళిక ప్రకారం పూర్తి చేయాలని ఆదేశించారు. అంతకుముందు భీమేశ్వర స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించిన శ్రీనివాస్ రాజ్ అనంతరం జాతరకు వచ్చే భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన ఉచిత బస్సు సేవలను జెండా ఊపి ప్రారంభించారు. ఆలయ విస్తరణ, అభివృద్ధి పనులపై జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో ఇన్ చార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ తో కలిసి ఆర్ అండ్ బీ, ఆలయ అధికారులు, ఆర్కిటెక్ట్ మూర్తి, కాంట్రాక్టర్ తో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రధాన ఆలయ విస్తరణ, ఇతర ప్రతి అభివృద్ధి పనికి సంబంధించి ఒక ప్రణాళిక ప్రకారం ముందుకు వెళ్లాలని సూచించారు. పనుల్లో వేగం పెంచాలని, అవసరమైన పనివారి సంఖ్య మరింత పెంచాలని ఆదేశించారు. పనుల పురోగతిలో ఏమైనా ఇబ్బందులు ఎదురైతే వాటిని సమన్వయంతో పరిష్కరించాలని తెలిపారు. నాణ్యతతో పనులను పూర్తి చేయాలని సూచించారు. నూతన గోశాల నిర్మాణం, ఇతర అంశాలపై చర్చించారు. ఇప్పుడు ఉన్న గోశాలలో ఎన్ని కోడెలు ఉన్నాయని ఆరా తీశారు. వాటి సంరక్షణ తదితర అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. రాజన్న ఆలయ విస్తరణ, అభివృద్ధి పనులు, బద్ది పోచమ్మ ఆలయ విస్తరణ, గుడి చెరువు బండ్ పార్క్ పనులపై సీఎం ప్రిన్సిపల్ సెక్రెటరీ శ్రీనివాస్ రాజ్ కు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ఏర్పాటు చేసి వివరించారు. ఈ సమావేశంలో ఆర్ అండ్ బీ సీఈ రాజేశ్వర్, ఎస్.ఈ రాములు ఈఈ నరసింహాచారి, ఆలయ ఈవో రమాదేవి, ఈఈ రాజేష్, జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి రవీందర్ రెడ్డి పాల్గొన్నారు.

# గో రక్షణే హిందువుల కర్తవ్యం

**గోశాల ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మహేష్ అగర్వాల్**

హైదరాబాద్, ఫిబ్రవరి 14 (ఈవార్తలు) : ముక్కోటి దేవతల ప్రతి రూపమైన గోవులను రక్షించడమే హిందువుల ప్రధాన కర్తవ్యమని తెలంగాణ గోశాల ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మహేష్ అగర్వాల్ అన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సమర్పణ్, తెలంగాణ గోశాల ఫెడరేషన్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం శ్రీరామచంద్ర డోంగ్రేజీ మహారాజ్ గోశాలలో ఉచిత పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో గోవధ నిషేధ చట్టాన్ని అమలు చేయడంలో ప్రభుత్వాలు, అధికారులు పూర్తిగా విఫమవుతున్నారని అన్నారు. హిందువుల ఆరాధ్య దైవం గోమాతను రక్షించుకోవాల్సిన అవసరం అందరిపైన ఉందని అన్నారు. గోరక్షా చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పశువులకు ఉచితంగా మందులు, పశు దాణాను అందజేశారు. కార్యక్రమంలో ఇండియన్ ఇమ్యునోలాజికల్స్ డాక్టర్ గుణీంద్ర బోరా, డాక్టర్ రాజు గౌరు, పారావెట జంగిలి ప్రశాంత్, శ్రీకాంత్, లయన్స ఇంటర్నేషనల్ యానిమల్ వెల్ఫేర్ జిల్లా చైర్మన్ ప్రేమ్ చంద్ మునోత్, జస్మత్ పటేల్, తదితరులు పాల్గొన్నారు.

# దుబ్బ రాజేశుడికి కలెక్టర్ పట్టువస్త్రాలు

**కల్యాణానికి సతీమణితో కలిసి హాజరు**



సారంగాపూర్, ఫిబ్రవరి 14 (ఈవార్తలు): మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని శనివారం సారంగాపూర్ మండలం పెంబట్ల కోనాపూర్ గ్రామంలో వెలసిన శ్రీ దుబ్బరాజేశ్వర స్వామివారి కళ్యాణ మహోత్సవానికి జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ దంపతులు హాజరై పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించి ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం ఆలయ అర్చకులు, వేద పండితులు కలెక్టర్ దంపతులను ఆశీర్వదించి శాలువాతో ఘనంగా సన్మానించి తీర్థప్రసాదాలు అందజేశారు. దుబ్బ రాజన్న ఆలయ ఆవరణలో ఏర్పాటుచేసిన కల్యాణవేదికపై శివపార్వతుల కళ్యాణ మహోత్సవాన్ని జిల్లా కలెక్టర్ దంపతులు మరియు విశేషంగా హాజరైన భక్తులు తిలకించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి.సత్య ప్రసాద్ మాట్లాడుతూ మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ప్రజలందరికీ ఆధ్యాత్మిక శాంతి ఆయురారోగ్యాలు ప్రసాదించాలని, శివపార్వతుల దివ్య ఆశీస్సులు జిల్లా ప్రజలందరికీ కలగాలని ఆకాంక్షించారు. జాతరకు విచ్చేసే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన ఏర్పాట్లు చేయాలని, శానిటేషన్, పారిశుద్ధ్య నిర్వహణ నిరంతరం చేపట్టాలని, భక్తుల అధిక రద్దీని దృష్టిలో ఉంచుకొని సురక్షిత త్రాగునీటి సౌకర్యం సమృద్ధిగా కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అందరు అధికారులు సమన్వయంతో పని చేస్తూ భక్తులందరికీ అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎండోమెంట్ అసిస్టెంట్ కమిషనర్ సుప్రియ, ఆలయ ఈవో అనూష, ఎమ్మార్వో వహీద్, ఎంపీడీవో సలీం, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.





మహా శివరాత్రి జాతర సందర్భంగా ఏర్పాటు చేసిన శివార్చన స్టేజిని శనివారం ఎస్పీ మహేష్ బీ గితేతో కలిసి ప్రారంభిస్తున్న రాజన్న సిరిసిల్ల ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్

# కపిలేశ్వరాలయంలో 16న శివపార్వతుల కల్యాణం

తిరుపతి, ఫిబ్రవరి 14 (ఈవార్తలు): తిరుపతిలోని శ్రీ కపిలేశ్వరస్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఫిబ్రవరి 15వ తేదీ ఆదివారం మహాశివరాత్రి పర్వదినాన్ని ఘనంగా నిర్వహించనున్నారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రత్యేకంగా క్యూలైన్లు, చలువపందిళ్లు, పార్కింగ్ ప్రదేశాలు ఏర్పాటు చేసినట్టుగా తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) వెల్లడించింది. మహాశివరాత్రి సందర్భంగా ఆదివారం తెల్లవారుజామున 2.30 గంటల నుంచి 4.30 గంటల వరకు మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహిస్తారని తెలిపింది. ఉదయం 8 నుంచి 10 గంటల వరకు రథోత్సవం(భోగితేరు), ఉదయం 11 నుంచి 12 గంటల వరకు స్నపన తిరుమంజనం, సాయంత్రం 6 నుండి రాత్రి 10 గంటల వరకు విశేషమైన నంది వాహనసేవ జరుగనున్నాయని తెలిపింది. అలాగే ఆదివారం ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు, సాయంత్రం 4.30 నుంచి రాత్రి 12 గంటల వరకు భక్తులకు స్వామివారి సర్వదర్శనం కల్పించనున్నట్టుగా టీటీడీ తెలిపింది. ఫిబ్రవరి 16వ తేదీ సోమవారం తెల్లవారుజామున 12 నుంచి ఉదయం 4 గంటల వరకు లింగోద్భవకాల అభిషేకం నిర్వహిస్తారని చెప్పింది. శ్రీ కామాక్షి సమేత కపిలేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మహాశివరాత్రి మరుసటి రోజైన సోమవారం శివపార్వతుల కల్యాణమహోత్సవం అంగరంగ వైభవంగా జరుగనుందని టీటీడీ తెలిపింది. సోమవారం సాయంత్రం 6 నుంచి రాత్రి 7.30 గంటల వరకు ఆర్జితసేవగా ఈ కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తారి పేర్కొంది. గృహస్తులు(ఇద్దరు) అప్పటికప్పుడు రూ. 500 చెల్లించి టికెట్ కొనుగోలు చేసి శివపార్వతుల కల్యాణోత్సవంలో పాల్గొనవచ్చని తెలిపింది. గృహస్తులకు లడ్డూ ప్రసాదం బహుమానంగా అందజేస్తారని పేర్కొంది. ఇక, తిరుపతి శ్రీకపిలేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో ఆరో రోజు శుక్రవారం ఉదయం శ్రీ సోమస్కంధమూర్తి వ్యాఘ్ర వాహనంపై అనుగ్రహించారు. భజనమండళ్ల కోలాటాలు, భజనలు, మంగళవాయిద్యాల మధ్య పురవీధుల్లో వాహనసేన కోలాహలంగా సాగింది. వాహనసేవలో ఆలయ అధికారులు, అర్చకులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## దామోదరం సంజీవయ్యకు జగన్ నివాళి

తాడేపల్లి, ఫిబ్రవరి 14 (ఈవార్తలు): దివంగత మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య జయంతి నేడు. ఈ సందర్భంగా ఆయనకు వైసీపీ అధినేత జగన్ నివాళులు అర్పించారు. ఎక్స్ వేదికగా జగన్ స్పందిస్తూ... అణగారిన వర్గాల ఆశలకు ప్రతీకగా నిలిచిన నాయకుడు, దేశంలోనే తొలి దళిత ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య అని కొనియాడారు. పేదల అభ్యున్నతికి తన జీవితాన్ని అంకితం చేసిన మహోన్నత వ్యక్తి అని కితాబునిచ్చారు. ఆ మహనీయుడి సేవలను స్మరించుకుంటూ ఆయన జయంతి సందర్భంగా నివాళులు అర్పిస్తున్నానని తెలిపారు.

## ఏపీ లిక్కర్ స్కామ్ లో మరో కేసు నమోదు

విజయవాడ, ఫిబ్రవరి 14 (ఈవార్తలు): ఏపీ రాజకీయాలను కుదిపేస్తున్న లిక్కర్ స్కామ్ కేసులో మరో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసులో సీఐడీ అధికారులు మరో కేసు నమోదు చేశారు. గత ప్రభుత్వ హయాంలో ఏపీఎస్పీబీసీఐ డిపోల నుంచి ప్రభుత్వ మద్యం దుకాణాలకు సరఫరా చేసే రవాణా టెండర్లలో అక్రమాలకు పాల్పడ్డారనే ఆరోపణలపై తాజా కేసు నమోదయింది. ప్రభుత్వ ఖజానాకు నష్టం వాటిల్లేలా వ్యవహరించారని కేసు నమోదు చేశారు. రవాణా టెండర్లలో రూ. 200 కోట్ల నుంచి రూ. 400 కోట్ల వరకు అక్రమాలను పాల్పడినట్టు సమాచారం. ఈ కేసు విచారణ బాధ్యతలను సిట్ చీఫ్ ఎస్పీ రాజశేఖర్ బాబుకు అప్పగించారు. మరోవైపు, లిక్కర్ స్కామ్ లో ప్రధాన సూత్రధారిగా భావిస్తున్న రాజ్ కేసిరెడ్డి బెయిల్ పిటిషన్ ను ఇటీవల సుప్రీంకోర్టు తిరస్కరించిన సంగతి తెలిసిందే. ఈ కుంభకోణంలో రాజకీయ నాయకులు, అధికారుల ప్రమేయంపై కూడా సుప్రీంకోర్టు తీవ్ర వ్యాఖ్యలు చేసింది. ఈ స్కామ్ లో రూ. 3,500 కోట్లకు పైగా అక్రమ లావాదేవీలు జరిగినట్టు సిట్ అధికారులు అంచనా వేశారు.

# ముగ్గురి పేర్లు పదిసార్లు చదివారు

**అంతకుమించి బడ్జెట్‌లో ఏముంది?: బొత్స**



అమరావతి, ఫిబ్రవరి 14 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై శాసనమండలి మీడియా పాయింట్ వద్ద ప్రతిపక్ష నేత, వైసీపీ సీనియర్ నాయకుడు బొత్స సత్యనారాయణ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఆత్మస్తుతి... పరనింద అన్నట్టు బడ్జెట్ ప్రసంగం సాగిందని విమర్శించారు. ఇది అంకెల గారడీతో కూడిన పసలేని బడ్జెట్ అని, ఇందులో చంద్రబాబు, పవన్ కల్యాణ్, లోకేశ్ పేర్లను పదిసార్లు ప్రస్తావించడం తప్ప ప్రజలకు మేలు చేసే అంశాలు ఏవీ లేవని ఆయన దుయ్యబట్టారు. ఈ బడ్జెట్ ప్రజల్లో ఉన్న కొద్దిపాటి ధైర్యాన్ని, స్థైర్యాన్ని కూడా దెబ్బతీసిందని, ఇది మోసపూరిత పత్రమని ఆయన అభివర్ణించారు. బడ్జెట్‌పై జరిగిన చర్చలో బొత్స మాట్లాడుతూ, ప్రతి రంగంలోనూ ప్రభుత్వం ప్రజలను వంచిస్తోందని ఆరోపించారు. మహిళా సాధికారతపై ప్రభుత్వం చేస్తున్న ప్రచారాన్ని బొత్స తీవ్రంగా తప్పుపట్టారు. ప్రతి ఇంట్లో ఒక మహిళను పారిశ్రామికవేత్తగా తయారు చేస్తామనడం హాస్యాస్పదంగా ఉందని ఆయన ఎద్దేవా చేశారు. “గతంలో డ్వాక్రా సంఘాలను బలోపేతం చేసి, వారిలో పారిశ్రామిక స్ఫూర్తిని నింపడానికి వైఎస్ రాజశేఖర్ రెడ్డి పావలా వడ్డీ పథకాన్ని తెచ్చారు. ఆ తర్వాత వచ్చిన ప్రభుత్వాలు సున్నా వడ్డీని అమలు చేశాయి. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో ఒక్కరోజు కూడా ఆలస్యం లేకుండా నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకే సున్నా వడ్డీ డబ్బులు జమ అయ్యేవి. కానీ ఈ ప్రభుత్వం వచ్చి 19 నెలలైనా ఆ సున్నా వడ్డీ పథకం ఏమైందో తెలియదు. బడ్జెట్‌లో దానికి కేటాయింపులు లేవు. ఎలాంటి ఆర్థిక చేయూత లేకుండా మహిళలను పారిశ్రామికవేత్తలుగా ఎలా మారుస్తారో చంద్రబాబు చెప్పాలి. ఇది మహిళలను మోసం చేయడం కాదా?” అని బొత్స ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించారు. గ్రామీణాభివృద్ధి, ఉపాధి హామీ పథకం నిధుల కేటాయింపులోనూ ప్రభుత్వం కోత పెట్టిందని బొత్స ఆరోపించారు. “గతంలో ఉపాధి హామీ పథకం కింద 100 శాతం నిధులను కేంద్రమే భరించేది. ఇప్పుడు కేంద్రం నిబంధనలు మార్చి మెటీరియల్, లేబర్ కాంపోనెంట్లలో 40 శాతం వాటాను రాష్ట్ర ప్రభుత్వాలు భరించాలని చెప్పింది. గత ప్రభుత్వాల హయాంలో ఏటా సగటున రూ. 5,000 కోట్లు ఈ పథకం కింద ఖర్చు చేసేవారు. ప్రస్తుత నిబంధనల ప్రకారం రాష్ట్రం కనీసం రూ. 2,000 కోట్లు కేటాయించాలి. కానీ బడ్జెట్‌లో కేవలం రూ. 500 కోట్లు మాత్రమే చూపించారు. మిగిలిన బ్యాలెన్స్ సంగతేంటి? అంటే ఈ పథకాన్ని కూడా నీరుగార్చబోతున్నారా?” అని ఆయన నిలదీశారు. రాష్ట్ర అప్పుల విషయంలోనూ ప్రభుత్వం వాస్తవాలను వక్రీకరిస్తోందని బొత్స ఆరోపించారు. రాష్ట్ర విభజన నుంచి వారసత్వంగా రూ. 9.46 లక్షల కోట్ల అప్పులు వచ్చాయని చెప్పడం సత్యదూరమని అన్నారు. “మా ఐదేళ్ల పాలనలో కార్పొరేషన్లతో కలిపి మేం చేసిన అప్పు కేవలం రూ. 3 లక్షల కోట్లు మాత్రమే. అంతకుముందున్న టీడీపీ ప్రభుత్వం రూ. 2.30 లక్షల కోట్ల అప్పు చేసింది. వాస్తవాలు ఇలా ఉంటే, అప్పుల భారాన్ని మాపై నెట్టే ప్రయత్నం చేస్తున్నారు” అని బొత్స వివరించారు. ఈ బడ్జెట్‌లో కేవలం ప్రగల్భాలు తప్ప, నిర్దిష్ట కేటాయింపులు, ప్రజలకు భరోసా ఇచ్చే అంశాలు ఏవీ లేవని విమర్శించారు.

# విషమిచ్చి రష్యా విపక్ష నేత నావల్నీ హత్య

**ఐదు యూరోపియన్ దేశాల ఆరోపణ**

లండన్: రష్యన్ విపక్ష నేత అలెక్సీ నావల్నీ మృతిపై సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఆయనను అత్యంత అరుదైన కప్ప విషం ఉపయోగించి హత్య చేశారని, దీని వెనుక రష్యా ప్రభుత్వ హస్తం ఉందని బ్రిటన్‌తో సహా ఐదు యూరోపియన్ దేశాలు తీవ్రంగా ఆరోపించాయి. ఈ మేరకు ఆ దేశాలు సంయుక్త ప్రకటన విడుదల చేశాయి. నావల్నీ శరీరం నుంచి సేకరించిన నమూనాలను పరిశీలించగా, ‘ఎపిబాటిడిన్’ అనే శక్తివంతమైన న్యూరోటాక్సిన్ ఆనవాళ్లు ఉన్నట్లు ఈ దేశాలు ధృవీకరించాయి. దక్షిణ అమెరికాలో కనిపించే విషపు కప్పల (పాయిజన్ డార్ట్ ఫ్రాగ్స్) చర్మం నుంచి ఈ విషాన్ని సేకరిస్తారు. రష్యాలో ఇది సహజంగా లభించదని, ఈ విషాన్ని ఉపయోగించే సామర్థ్యం, ఉద్దేశం, అవకాశం రష్యా ప్రభుత్వానికి మాత్రమే ఉన్నాయని ఆ దేశాలు స్పష్టం చేశాయి. ఈ ఆరోపణలతో బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ, స్వీడన్, నెదర్లాండ్స్ దేశాలు రష్యాపై రసాయన ఆయుధాల నిషేధ సంస్థకు ఫిర్యాదు చేశాయి. రష్యా తన రాజకీయ ప్రత్యర్థులను చూసి భయపడుతోందని, అందుకే ఈ ఘోరానికి పాల్పడిందని బ్రిటిష్ విదేశాంగ మంత్రి కూపర్ అన్నారు. మ్యూనిచ్ సెక్యూరిటీ కాన్ఫరెన్స్ సందర్భంగా నావల్నీ భార్య యూలియా నవల్నాయ మాట్లాడుతూ.. “రెండేళ్ల క్రితం నా భర్తను పుతిన్ చంపారని చెప్పాను. అప్పుడు అవి కేవలం మాటలు. కానీ ఇప్పుడు ఆ మాటలు శాస్త్రీయంగా నిరూపితమైన వాస్తవాలుగా మారాయి” అని ఆవేదన వ్యక్తం చేశారు. పుతిన్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడిన నావల్నీ, 2024 ఫిబ్రవరిలో ఆర్కిటిక్ జైలులో మరణించిన విషయం తెలిసిందే. అయితే, వాకింగ్ చేసిన తర్వాత అనారోగ్యంతో మరణించారని, అందులో అనుమానాస్పదమేమీ లేదని రష్యా అధికారులు అప్పట్లో ప్రకటించారు. కాగా, నావల్నీ హత్య ఆరోపణలను రష్యా మొదటి నుంచి ఖండిస్తోంది.

# మా పాలనకు తీర్పు

**తెలంగాణ మున్సిపల్ ఎన్నికల ఫలితాలపై రాహుల్**

న్యూఢిల్లీ: తెలంగాణలో జరిగిన పురపాలక, నగరపాలక సంస్థల ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీ సత్తా చాటింది. ఈ ఫలితాలు తమ సంక్షేమ పాలనకు, ప్రజల తెలంగాణ నమూనాకు ప్రజలు ఇచ్చిన ఆమోదమని కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తెలిపారు. శనివారం ఆయన ‘ఎక్స్’ వేదికగా స్పందిస్తూ.. ఈ విజయం కాంగ్రెస్ కార్యకర్తలు, తెలంగాణ ప్రజలదని పేర్కొన్నారు. ప్రతి కుటుంబానికీ అభివృద్ధి ఫలాలు అందించాలనే తమ ‘ప్రజల తెలంగాణ’ లక్ష్యం స్థిరంగా ఉంటుందని హామీ ఇచ్చారు. రాష్ట్రంలోని 116 మున్సిపాలిటీలకు గాను కాంగ్రెస్ పార్టీ 64 చోట్ల జయకేతనం ఎగురవేసింది. అలాగే 7 కార్పొరేషన్లలో మూడింటిని కైవసం చేసుకుంది. మంచాల, రామగుండం, నల్గొండ కార్పొరేషన్లు హస్తం ఖాతాలో చేరాయి. ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ కేవలం 13 మున్సిపాలిటీలు, 3 కార్పొరేషన్లతో సరిపెట్టుకుంది. మరో 38 మున్సిపాలిటీల్లో ఏ పార్టీకీ స్పష్టమైన ఆధిక్యం లభించలేదు. దీంతో ఛైర్‌పర్సన్, వైస్ ఛైర్‌పర్సన్ ఎన్నికల కోసం స్వతంత్రులు, చిన్న పార్టీల మద్దతు కూడగట్టేందుకు కాంగ్రెస్, బీఆర్ఎస్ తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయి. 2020లో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో అప్పటి టీఆర్ఎస్ (ప్రస్తుత బీఆర్ఎస్) 100కు పైగా స్థానిక సంస్థలను గెలుచుకోగా, ఈసారి ఆ పార్టీ పనితీరు గణనీయంగా తగ్గింది. ఇక బీజేపీ సొంతంగా ఒక్క మున్సిపాలిటీని గెలవనప్పటికీ, తమ ఎంపీ స్థానాలైన కరీంనగర్, నిజామాబాద్ కార్పొరేషన్లలో అతిపెద్ద పార్టీగా అవతరించింది. మొత్తం 2,582 మున్సిపల్ వార్డులకు గాను కాంగ్రెస్ 1,347, బీఆర్ఎస్ 717, బీజేపీ 261 వార్డులను గెలుచుకున్నాయి. బుధవారం జరిగిన ఈ ఎన్నికల్లో 73 శాతానికి పైగా పోలింగ్ నమోదు కాగా, శుక్రవారం ఓట్ల లెక్కింపు ప్రక్రియను పూర్తిచేశారు.

# అప్పు ఎంత ఉందో చెప్పలేదు: బుగ్గన

అమరావతి, ఫిబ్రవరి 14 (ఈవార్తలు): ఏపీ శాసనసభలో ఈరోజు కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్ పై వైసీపీ నేత, రాష్ట్ర మాజీ ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి విమర్శలు గుప్పించారు. ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ బడ్జెట్ స్పీచ్ లో అన్నీ అబద్ధాలే చెప్పారని విమర్శించారు. అసెంబ్లీలో అబద్ధాలు చెప్పడం పెద్ద నేరమని అన్నారు. ఈ బడ్జెట్ లో కొత్తదనం ఏమీ లేదని... గత బడ్జెట్ బుక్ ను మళ్లీ చదివినట్టే ఉందని చెప్పారు. రాష్ట్ర అప్పు ఎంత ఉందో చెప్పలేదని విమర్శించారు. తమ ప్రభుత్వ హయాంలో 9 శాతం వృద్ధి సాధించామని బుగ్గన చెప్పారు. లక్ష 35 వేల మంది యువతకు ఉపాధి కల్పించామని తెలిపారు. మొత్తం 10,032 విలేజ్ క్లినిక్ లను ఏర్పాటు చేశామని చెప్పారు. నాడు-నేడు కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి కోసం రూ. 3,700 కోట్లు ఖర్చు పెట్టామని తెలిపారు. 10,775 రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేశామని చెప్పారు.

# ‘భోలే బాబా’ పేరుతో రెండు సంస్థలు

**క్లారిటీ ఇచ్చిన హెరిటేజ్ ఫుడ్స్**

తిరుపతి, ఫిబ్రవరి 14 (ఈవార్తలు): తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) లడ్డూ ప్రసాదం నెయ్యి వివాదంతో తమకు ఎలాంటి సంబంధం లేదని ప్రముఖ డెయిరీ సంస్థ హెరిటేజ్ ఫుడ్స్ లిమిటెడ్ స్పష్టం చేసింది. ఈ మేరకు సాక్షి దినపత్రికలో వచ్చిన ఒక కథనాన్ని తీవ్రంగా ఖండిస్తూ శనివారం అధికారికంగా ఒక స్పష్టీకరణ లేఖను విడుదల చేసింది. తమ కంపెనీని, టీటీడీకి నెయ్యి సరఫరా చేసి వివాదంలో చిక్కుకున్న ‘భోలే బాబా డెయిరీ’ని ముడిపెడుతూ వచ్చిన వార్తలు పూర్తిగా అవాస్తవం, దురుద్దేశపూరితం, రాజకీయ ప్రేరేపితమైనవని హెరిటేజ్ ఫుడ్స్ పేర్కొంది. నేడు (ఫిబ్రవరి 14న) సాక్షి పత్రిక ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ఎడిషన్లలో ప్రచురితమైన కథనంపై హెరిటేజ్ ఫుడ్స్ అభ్యంతరం వ్యక్తం చేసింది. ఒకే రకమైన పేరుతో ఉన్న రెండు వేర్వేరు కంపెనీల మధ్య గందరగోళం సృష్టించి, తమ సంస్థ ప్రతిష్ఠకు భంగం కలిగించే ప్రయత్నం జరుగుతోందని తన అధికారిక ఎక్స్ ఖాతా ద్వారా విడుదల చేసిన ప్రకటనలో వివరించింది.







# ఈఎల్ఎఫ్‌పై మోదీ విమానం

## చైనా సరిహద్దుల్లో చరిత్రాత్మక ఘట్టం.. ఈశాన్య భారతంలో తొలి ఈఎల్ఎఫ్ ఏర్పాటు

### చైనా సరిహద్దుకు 300 కిలోమీటర్ల దూరంలో ఉన్న మోరెన్.. అత్యవసర పరిస్థితుల్లో ఫైటర్ జెట్లు, విమానాలు ల్యాండింగ్

గౌహతి: చైనా సరిహద్దుల్లో చరిత్రాత్మక ఘట్టం ఆవిష్కృతమైంది. ఈశాన్య భారతంలో ఏర్పాటైన మొట్టమొదటి ఎమర్జెన్సీ ల్యాండింగ్ ఫెసిలిటీపై ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రయాణిస్తున్న సీ-130జే విమానం ల్యాండ్ అయ్యింది. అసోంలోని మోరెన్ జాతీయ రహదారిపై ఈ ఈ ఫెసిలిటీ ఏర్పాటు చేశారు. ఇది చైనా సరిహద్దుకు 300 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. అసోంలో త్వరలోనే అసెంబ్లీ ఎన్నికలు జరగనుండగా.. మోదీ ఆ రాష్ట్ర పర్యటన సందర్భంగా ఆయన ప్రయాణిస్తున్న విమానం 37వ నెంబరు జాతీయ రహదారి దిగింది. చెబువా ఎయిర్‌పోర్ట్ నుంచి మోరెన్ ఈఎల్ఎఫ్‌కు ప్రధాని సీ-130జే విమానంలోనే చేరుకున్నారు. అంతకు ముందు ప్రధాని మోదీ ఎక్స్ (ట్విట్టర్)లో స్పందిస్తూ "ఈఎల్ఎఫ్ అత్యవసర ప్రతిస్పందనకు చాలా కీలకమని, సవాళ్లతో కూడుకున్న పరిస్థితుల్లో రెస్క్యూ, రిలీఫ్ కార్యకలాపాలను సకాలంలో చేపట్టడానికి వీలు కల్పిస్తుంది" అని అన్నారు. రూ. 100 కోట్లతో మోరెన్ జాతీయ రహదారిపై 4.2 కి.మీ. మేర దీనిని ఏర్పాటుచేశారు. యుద్ధ విమానాలు, రవాణా విమానాలకు వ్యూహాత్మక రన్‌వేగా ఇది పనిచేస్తుంది. రక్షణ, లాజిస్టిక్స్‌తో పాటు విపత్తుల సమయంలో ప్రతిస్పందనను బలోపేతం చేస్తుంది. పౌర, సైనిక వినియోగం కోసం ఏర్పాటైన ఈ ఫెసిలిటీ.. అత్యవసర పరిస్థితుల్లో దిబ్రుగఢ్ విమానాశ్రయానికి ప్రత్యామ్నాయంగా సేవలు అందిస్తుంది. 40 టన్నుల వరకు యుద్ధ విమానాలను, గరిష్ఠంగా 74 టన్నుల వరకు రవాణా విమానాలను ఇది నిర్వహించగలదు. దేశంలోని మొదటి ఈఎఫ్ఎల్ 2021లో రాజస్థాన్‌లోని బర్మేర్ జిల్లాలో ప్రారంభించారు. ప్రధాని మోదీ విమానం ల్యాండైన తర్వాత 40 నిమిషాల పాటు తెజాస్, సుఖోయ్, రఫేల్, ఇతర యుద్ధ విమానాలతో ఎయిర్‌షో నిర్వహించారు.







## మణిపూర్‌కు టికెట్ బుక్ చేశాం: కాంగ్రెస్

ప్రధాని నరేంద్ర మోదీకి అసోం నుంచి మణిపూర్‌కు కాంగ్రెస్ పార్టీ టిక్కెట్ బుక్ చేసింది. ఈశాన్య భారతంలో తొలిసారి ఏర్పాటైన తొలి ఎమర్జెన్సీ ల్యాండింగ్ సౌకర్యాన్ని ఆయన ఈరోజు ప్రారంభించారు. దీనిపై మోదీ ప్రయాణిస్తున్న ఎయిర్ క్రాఫ్ట్ ల్యాండ్ అయింది. ఈ నేపథ్యంలో మణిపూర్ కూడా వెళ్లాలంటూ కాంగ్రెస్ పార్టీ ఈ టిక్కెట్ బుక్ చేసింది. మణిపూర్‌లోని లిటాన్ సరిఖోంగ్ గ్రామంలో ఆదివారం అర్ధరాత్రి తాంగ్‌ఖుల్ నాగా వర్గానికి చెందిన వారి ఇళ్లకు సాయుధ మిలిటెంట్లు నిప్పు పెట్టారు. దీంతో అక్కడ మరోసారి ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఇదే సమయంలో ప్రధాని మోదీ అసోం పర్యటనకు వెళుతుండటంతో కాంగ్రెస్ పార్టీ మణిపూర్ అంశాన్ని లేవనెత్తింది. ప్రధాని మోదీ మణిపూర్‌లో పర్యటించకపోవడాన్ని కాంగ్రెస్ సీనియర్ నేత పవన్ ఖేరా ప్రశ్నించారు. అసోం నుంచి మణిపూర్‌కు కేవలం గంటలో వెళ్లవచ్చని ప్రధానికి సూచించారు. ఆయన అక్కడకు వెళ్లడానికి తామే టిక్కెట్ బుక్ చేశామని వెల్లడించారు. మణిపూర్ గత మూడేళ్లుగా మండుతోందని, తాజా దాడులతో ఉద్రిక్తతలు మరోసారి పెరిగాయని పవన్ ఖేరా ఆందోళన వ్యక్తం చేశారు. "మీరు ఇప్పుడు అసోంలోనే ఉన్నారు. అక్కడి నుంచి మణిపూర్ వెళ్లడానికి గౌహతి విమానాశ్రయం నుంచి ఇంఫాల్‌కు విమానం టిక్కెట్ బుక్ చేశాం. మీ ఆ విమానంలో మణిపూర్ వెళ్లవచ్చు. మీ ఫోన్ నెంబర్ నా వద్ద లేదు కాబట్టి విమాన టిక్కెట్‌ను సోషల్ మీడియాలో షేర్ చేస్తున్నాను. దయచేసి ఈ టిక్కెట్ ద్వారా మణిపూర్ వెళ్లండి" అని మోదీని ఉద్దేశించి 'ఎక్స్'లో పోస్టు పెట్టారు.

## జిల్లా ఆస్పత్రుల్లో
# కీమో థెరపీ

**దేశవ్యాప్తంగా డే కేర్ సెంటర్లు.. ఉచితంగా మందుల సరఫరా**

**క్యాన్సర్ రోగులకు కేంద్రం ఉపశమనం**

న్యూఢిల్లీ: క్యాన్సర్ రోగులకు కేంద్ర ప్రభుత్వం భారీ ఊరట కల్పించింది. దేశవ్యాప్తంగా జిల్లా ఆసుపత్రుల్లో డే కేర్ క్యాన్సర్ సెంటర్లను ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించింది. రాబోయే మూడేళ్లలో ఈ కేంద్రాలను నెలకొల్పనుండగా, 2025-26 ఆర్థిక సంవత్సరంలోనే 200 కేంద్రాలను ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ నిర్ణయంతో కీమోథెరపీ వంటి కీలక చికిత్సలు రోగుల నివాస ప్రాంతాలకు దగ్గరగా అందుబాటులోకి రానున్నాయి. క్యాన్సర్ చికిత్స కోసం రోగులు నెలల తరబడి ఎన్నోసార్లు ఆసుపత్రులకు వెళ్లాల్సి ఉంటుంది. ముఖ్యంగా గ్రామీణ, ఆర్థికంగా వెనుకబడిన వర్గాల ప్రజలు కీమోథెరపీ కోసం నగరాల్లోని పెద్ద ఆసుపత్రులకు ప్రయాణించడం శారీరకంగా, ఆర్థికంగా పెనుభారంగా మారుతోంది. ప్రయాణం, బస, ఆహారం, రోజువారీ వేతనం కోల్పోవడం వంటి ఖర్చులు కుటుంబాలను కుంగదీస్తున్నాయి. కీమోథెరపీ తీసుకునే రోగులు బలహీనంగా ఉండటంతో, వారికి సహాయకులు తోడుగా వెళ్లాల్సి రావడం అదనపు భారం. ఈ ఇబ్బందులను దూరం చేసేందుకే ప్రభుత్వం జిల్లాస్థాయిలో ఈ డే కేర్ కేంద్రాలను ప్రారంభిస్తోంది. ఈ కేంద్రాల ఏర్పాటుకు ముందు ప్రభుత్వం రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలతో కలిసి లోటుపాట్లపై అధ్యయనం చేసింది. క్యాన్సర్ కేసుల సంఖ్య, రోగుల భారం, మౌలిక సదుపాయాల లభ్యత ఆధారంగా జిల్లాలను ఎంపిక చేశారు. ఎంపికైన జిల్లాల్లోని వైద్యులు, నర్సులకు ప్రభుత్వ వైద్య కళాశాలలు, ప్రాంతీయ క్యాన్సర్ కేంద్రాల్లో 4 నుంచి 6 వారాల పాటు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. కీమోథెరపీ మందుల మోతాదు, దుష్ప్రభావాల నిర్వహణ, అత్యవసర పరిస్థితుల ఎదుర్కోవడం, మందుల భద్రత వంటి అంశాల్లో వారికి శిక్షణనిచ్చారు. ఈ కేంద్రాల ద్వారా అవసరమైన కీమోథెరపీ మందులను ఉచితంగా అందించనున్నారు. క్యాన్సర్ చికిత్సలో మందుల ఖర్చు అధికంగా ఉండే నేపథ్యంలో ఈ నిర్ణయం రోగులపై ఆర్థిక భారాన్ని గణనీయంగా తగ్గిస్తుంది.


# నలుగురు కోబ్రా కమాండోల దుర్మరణం

**ఛత్తీస్‌గఢ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం**



రాయ్‌పూర్: ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో 201వ కోబ్రా బెటాలియన్‌కు చెందిన నలుగురు కమాండోలు ప్రాణాలు కోల్పోయారు. మరో కమాండో ప్రాణాపాయ స్థితిలో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ధమ్తరి జిల్లాలోని ఖప్రి బైపాస్‌పై శనివారం ఆగి ఉన్న ఒక ట్రక్కును కోబ్రా కమాండోలు ప్రయాణిస్తున్న కారు ఢీకొట్టడంతో ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. నక్సలిజంపై పోరాటంలో అంకితభావంతో పనిచేస్తున్న కమాండోలు మరణించడంపై రాష్ట్రవ్యాప్తంగా విషాద ఛాయలు అలుముకున్నాయి. అర్జుని పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ ఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, కమాండోలు జగదల్‌పూర్ నుంచి కారులో తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. వేగంగా వచ్చిన కారు ఆగి ఉన్న ట్రక్కును వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. ప్రమాద తీవ్రతకు కారు ముందు భాగం ట్రక్కు కిందకు దూసుకెళ్లి నుజ్జునుజ్జయింది. సమాచారం అందుకున్న పోలీసులు, సహాయక బృందాలు ఘటనాస్థలికి చేరుకుని, గ్యాస్ కట్టర్ల సహాయంతో కారులో చిక్కుకున్న వారిని బయటకు తీశాయి. ఈ ప్రమాదంలో ఇద్దరు కమాండోలు అక్కడికక్కడే మృతి చెందగా, మరో ఇద్దరు ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో ప్రాణాలు విడిచారు. తీవ్రంగా గాయపడిన మరో కమాండోను ధమ్తరి జిల్లా ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం అతడి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. ఈ ఘటనపై ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి విష్ణు దేవ్ సాయి 'ఎక్స్' వేదికగా తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. "కోబ్రా బెటాలియన్ వీర జవాన్లు అకాల మరణం చెందారన్న వార్త హృదయ విదారకంగా ఉంది. దేశ సేవలో అంకితమైన ఆ అమర జవాన్లకు నా వినమ్ర నివాళులు" అని పేర్కొన్నారు. రాష్ట్ర హోంమంత్రి విజయ్ శర్మ కూడా మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ప్రాథమికంగా అతివేగమే ప్రమాదానికి కారణంగా పోలీసులు భావిస్తున్నప్పటికీ, అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో ఆపరేషన్ల కోసం సీఆర్‌పీఎఫ్ కింద పనిచేసే ప్రత్యేక దళమే కోబ్రా (కమాండో బెటాలియన్ ఫర్ రెజల్యూట్ యాక్షన్).

# ఆర్మీ పుస్తకాలపై కొత్త నిబంధనలు?




**నరవణే పుస్తకం ఎఫెక్ట్‌తో కేంద్రం నిర్ణయం!**


న్యూఢిల్లీ: మాజీ ఆర్మీ చీఫ్ ఎంఎం నరవణె రచించిన 'ఫోర్ స్టార్స్ ఆఫ్ డెస్టినీ' పుస్తకం వివాదం నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకునే దిశగా ఆలోచన చేస్తోంది. మిలిటరీ అధికారులు, అత్యున్నత పదవుల్లోని వ్యక్తులకు సంబంధించిన పుస్తకాల విషయంలో కేంద్రం కొత్త నిబంధనలు తీసుకురావాలని భావిస్తోంది. ప్రస్తుతం పనిచేస్తున్న, పదవీ విరమణ చేసిన సాయుధ దళాల సిబ్బంది పుస్తకాలు రాయడానికి, ప్రచురించడానికి 20 సంవత్సరాల 'కూలింగ్ ఆఫ్ పీరియడ్' మార్గదర్శకాలను ప్రవేశపెట్టడాన్ని కేంద్రం పరిశీలిస్తోందని తెలుస్తోంది. ఆయా అధికారులు పదవుల నుంచి రిటైర్ అయిన తర్వాత ఇరవై సంవత్సరాల వరకు వారి పుస్తకాలు పబ్లిష్ కాకుండా తప్పనిసరిగా ఈ నిబంధనను అమలు చేయాలని కేంద్రం భావిస్తోందని తెలుస్తోంది. ఇటీవల జరిగిన కేంద్ర కేబినెట్ సమావేశంలో ఈ విషయం చర్చించారని ఆంగ్ల మీడియాలో వార్తలు వచ్చాయి. సీనియర్ సైనిక అధికారులతో సహా ఉన్నత పదవులు నిర్వహించిన వారు సున్నితమైన అంశాలపై పుస్తకాలు రాయడానికి తప్పనిసరి కూలింగ్ ఆఫ్ పీరియడ్ నిబంధనను తీసుకురావాలని ఎక్కువ మంది మంత్రులు సమర్థించారని తెలుస్తోంది.

# ఎప్‌స్టీన్‌ది ఆత్మహత్య కాదు?

**తెరపైకి కొత్త అనుమానాలు**

వాషింగ్టన్: లైంగిక నేరస్థుడు, వివాదాస్పద ఫైనాన్షియర్ జెఫ్రీ ఎప్‌స్టీన్ జైలులో మరణించి ఏడేళ్లు కావొస్తున్నా, ఆ మిస్టరీ మాత్రం వీడటం లేదు. తాజాగా అమెరికా న్యాయ శాఖ విడుదల చేసిన ఫైళ్లు.. 2019 ఆగస్టు 10న న్యూయార్క్ జైలు గదిలో అసలేం జరిగిందనే ప్రశ్నలను మరోసారి తెరపైకి తెచ్చాయి. ఈ కొత్త పత్రాలు పాత అనుమానాలకు మరింత బలం చేకూరుస్తున్నాయి. మైనర్ బాలికలతో సెక్స్ ట్రాఫికింగ్ ఆరోపణలపై 2019 జూలై 6న అరెస్టయిన 66 ఏళ్ల ఎప్‌స్టీన్‌ను మన్‌హట్టన్‌లోని మెట్రోపాలిటన్ కరెక్షనల్ సెంటర్‌లో ఉంచారు. జులై 23న తన గదిలో మెడకు నారింజ రంగు వస్త్రంతో అపస్మారక స్థితిలో కనిపించాడు. తన తోటి ఖైదీ తనను చంపడానికి ప్రయత్నించాడని ఆరోపించాడు. అయితే, ఆ తర్వాత కొన్ని రోజులకే జైలు సైకాలజిస్ట్‌తో మాట్లాడుతూ.. తనకు ఆత్మహత్య చేసుకునే ఉద్దేశం లేదని, "అలా చేసుకోవడం పిచ్చితనం" అని చెప్పాడు. ఎప్‌స్టీన్ మరణానికి కేవలం రెండు రోజుల ముందు, ఆగస్టు 8న, అతను తన 577 మిలియన్ డాలర్ల ఆస్తిని ఒక ట్రస్టుకు బదిలీ చేస్తూ కొత్త వీలునామాపై సంతకం చేయడం గమనార్హం. ఆగస్టు 9న రాత్రి ఎప్‌స్టీన్ గదిలో ఉండాల్సిన తోటి ఖైదీని అధికారులు మార్చారు. కానీ, అతని స్థానంలో మరొకరిని నియమించలేదు. ఆ రాత్రి విధుల్లో ఉన్న గార్డులు టోవా నోయెల్, ఘిట్టో బోన్‌హోమ్ ప్రతి 30 నిమిషాలకు ఖైదీలను తనిఖీ చేయాల్సి ఉండగా, వారు మూడు గంటల పాటు నిద్రపోయినట్లు తర్వాత తేలింది. అంతేకాకుండా, తనిఖీలు చేయకపోయినా చేసినట్లు రికార్డులు తారుమారు చేశారు. ఆగస్టు 10 ఉదయం 6:33 గంటలకు ఎప్‌స్టీన్ తన గదిలో ఉరికి వేలాడుతూ కనిపించాడు. అధికారులు ఆత్మహత్యగా నిర్ధారించారు. అయితే, ఎప్‌స్టీన్ సోదరుడి అభ్యర్థన మేరకు శవపరీక్షను పరిశీలించిన నిపుణుడు డాక్టర్ మైఖేల్ బాడెన్, మెడపై ఉన్న గాయాలు ఆత్మహత్య కంటే గొంతు నులమడం వల్ల కలిగే గాయాలలా ఉన్నాయని అభిప్రాయపడ్డారు. జైలులో తీవ్రమైన లోపాలు జరిగాయని అప్పటి అటార్నీ జనరల్ విలియం బార్ అంగీకరించారు. తాజాగా విడుదలైన ఫైళ్లతో ఎప్‌స్టీన్‌ది నిజంగా ఆత్మహత్యేనా? లేక పక్కా ప్రణాళికతో జరిగిన హత్యనా? అనే అనుమానాలు మళ్లీ బలపడ్డాయి.

# 30 లక్షలతో నగలతో పెళ్లికి.. యువతి అదృశ్యం!




బెంగళూరు: కర్ణాటకలోని హాసన్ జిల్లాలో ఓ మహిళ అదృశ్యమైన ఘటన తీవ్ర కలకలం రేపుతోంది. పెళ్లికి హాజరై తిరిగి వస్తున్న ఆమె ఆచూకీ గల్లంతవడం, ఆ తర్వాత ఆమెకు చెందిన దుస్తులు, వస్తువులు అనుమానాస్పద స్థితిలో లభ్యం కావడం పలు అనుమానాలకు తావిస్తోంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, తుమకూరు జిల్లా కుణిగల్ ప్రాంతానికి చెందిన ప్రియాంక (29) చిక్కమగళూరులో జరిగిన ఓ వివాహ వేడుకకు ఒంటరిగా వెళ్లింది. ఫిబ్రవరి 12న రాత్రి 8 గంటల సమయంలో హాసన్ జిల్లా బేలూరు బస్టాండ్ సమీపంలో ఆమె చివరిసారిగా కనిపించింది. అదే రోజు సాయంత్రం 7:30 గంటల ప్రాంతంలో కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి, "నాతో పాటు మరొకరు ఉన్నారు" అని చెప్పి వెంటనే కాల్ కట్ చేసింది. ఆ తర్వాత ఆమె ఫోన్ స్విచ్ఛాఫ్ అయింది. తాము పోలీసులకు ఫిర్యాదు చేసినా మొదట సరిగా స్పందించలేదని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. బేలూరు తాలూకా కల్కెరె ప్రాంతంలో ప్రియాంకకు చెందిన కుర్తా, లోదుస్తులు, చెప్పులు, వ్యానిటీ బ్యాగ్ వంటివి వేర్వేరు చోట్ల లభ్యం కావడంతో కేసు తీవ్రరూపం దాల్చింది. ఆమె అదృశ్యమైన సమయంలో సుమారు రూ. 30 లక్షల విలువైన బంగారు ఆభరణాలు ధరించి ఉందని, వాటి కోసమే ఆమెను ఎవరైనా అపహరించి దాడికి పాల్పడి ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ ఘటనపై జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి, ఆ తర్వాత కేసును అరెహళ్లి పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేసినట్లు హాసన్ ఎస్పీ శుభాన్విత తెలిపారు. డాగ్ స్క్వాడ్, ఫోరెన్సిక్ బృందాలు ఘటనా స్థలాన్ని పరిశీలించాయి.

# అమెరికాలో భారతీయ విద్యార్థి మిస్సింగ్

## ఐదు రోజులుగా కొనసాగుతున్న గాలింపు.. రంగంలోకి దిగిన భారత కాన్సులేట్



వాషింగ్టన్: అమెరికాలో ఉన్నత విద్య కోసం వెళ్లిన భారతీయ విద్యార్థి అదృశ్యమవడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. కర్ణాటకకు చెందిన 22 ఏళ్ల సాకేత్ శ్రీనివాసయ్య గత ఐదు రోజులుగా కనిపించకుండా పోయాడు. యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా, బర్కిలీలో చదువుతున్న అతను ఫిబ్రవరి 9న అదృశ్యమవ్వగా, అతని కోసం ఐదు రోజులుగా గాలిస్తున్నారు. అయినప్పటికీ అతని ఆచూకీ ఇప్పటివరకు లభించకపోవడంతో కుటుంబ సభ్యులు, స్నేహితులు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు. వివరాల్లోకి వెళితే, సాకేత్ శ్రీనివాసయ్య చివరిసారిగా యూనివర్సిటీ క్యాంపస్‌కు సుమారు కిలోమీటరు దూరంలో ఉన్న టిల్డెన్ రీజినల్ పార్క్ సమీపంలో కనిపించినట్లు అధికారులు గుర్తించారు. అతని పాస్‌పోర్ట్, ల్యాప్‌టాప్‌తో కూడిన బ్యాక్‌ప్యాక్‌ను అతని నివాసం దగ్గర కనుగొన్నారు. బర్కిలీ నగర పోలీసులు, ఇతర అధికార యంత్రాంగం లేక్ అంజా, బర్కిలీ హిల్స్ పరిసర ప్రాంతాలతో పాటు నగరంలోనూ ముమ్మరంగా గాలిస్తున్నారు. హెలికాప్టర్లు, డ్రోన్ల సహాయంతో అటవీ ప్రాంతాన్ని జల్లెడ పడుతున్నారు. సాకేత్ విద్యాపరంగా ఎంతో ప్రతిభావంతుడు. 2025లో ప్రతిష్ఠాత్మక ఐఐటీ మద్రాస్‌లో బీటెక్ పూర్తి చేశాడు. ప్రస్తుతం యూసీ బర్కిలీలో కెమికల్ అండ్ బయో మాలిక్యులర్ ఇంజినీరింగ్‌లో మాస్టర్స్ డిగ్రీ చదువుతున్నాడు. సాకేత్ 2025లో ఐఐటీ మద్రాస్‌లో బీటెక్ పూర్తి చేశాడు. హైపర్‌లూప్ టెక్నాలజీకి సంబంధించిన ఓ కూలింగ్ సిస్టమ్‌పై ఐదుగురితో కలిసి పేటెంట్ కూడా పొందడం అతని ప్రతిభకు నిదర్శనం. ఈ ఘటనపై శాన్ ఫ్రాన్సిస్కోలోని భారత కాన్సులేట్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. తాము సాకేత్ కుటుంబ సభ్యులతో నిరంతరం టచ్‌లో ఉన్నామని, స్థానిక అధికారులతో సంప్రదింపులు జరుపుతూ గాలింపు చర్యలను వేగవంతం చేసేందుకు కృషి చేస్తున్నామని ఒక ప్రకటనలో తెలిపింది. ఇటీవల కాలంలో అమెరికాలో భారత విద్యార్థులపై దాడులు, అనుమానాస్పద మరణాలు, అదృశ్యం ఘటనలు పెరుగుతున్న నేపథ్యంలో తాజా సంఘటన మరోసారి తల్లిదండ్రుల్లో ఆందోళనను రేకెత్తిస్తోంది.

ఈవార్తలు
# వినోదవాణి CINEMA
ఆదివారం 15-2-2026 | www.evarthalu.com | 6

## వయ్యారి చిత్రం




## 20 కోట్ల చెల్లించాలి.. ధనుష్‌కు నోటీసులు




రూ.20 కోట్లు నష్టపరిహారంగా చెల్లించాలంటూ సినీ నటుడు ధనుష్‌కు తమిళ నిర్మాణ సంస్థ తేనాండాళ్ ఫిల్మ్స్ లీగల్ నోటీసులు పంపించింది. చాలాకాలంగా వాయిదాపడుతున్న ఒక సినిమా ప్రాజెక్టుకు సంబంధించి ఈ నోటీసులు పంపించింది. ఆయన కమిట్‌మెంట్ పూర్తి చేయకపోవడం వల్ల తమ సినిమా ఆలస్యమై ఆర్థికంగా ఇబ్బందులు ఎదురయ్యాయని నిర్మాణ సంస్థ పేర్కొంది. ప్రస్తుతం ఈ అంశం కోలీవుడ్‌లో చర్చనీయాంశంగా మారింది. 2016లో నిర్మాణ సంస్థ తేనాండాళ్ ఫిల్మ్స్‌పై 'నాన్ రుద్రన్' సినిమాను చేయడానికి ధనుష్ ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ చిత్రాన్ని స్వీయ దర్శకత్వంలో తెరకెక్కించాలనుకున్నారు. అయితే తర్వాత దర్శకుడు మారారు. ఈ కారణంగా ధనుష్ తమకు స్క్రిప్ట్ ఇవ్వలేదని, దీంతో తమకు రూ.20 కోట్లు నష్టం వచ్చిందని నిర్మాణ సంస్థ ఆరోపించింది. ధనుష్ ఇప్పటి వరకు ఈ చిత్రాన్ని ప్రారంభించలేదని దీనిని పక్కన పెట్టి ఇతర చిత్రాలు అంగీకరిస్తున్నారని తేనాండాళ్ ఫిల్మ్స్ లీగల్ నోటీసులు పంపించింది. ధనుష్‌తో కలిసి ఈ సినిమాలో నటించాల్సిన నాగార్జున అక్కినేని, ఎస్.జే. సూర్య వంటి వారికి కొన్ని ఖర్చులు చెల్లించినట్లు తెలిపింది. కాగా దీనిపై ధనుష్ స్పందించాల్సి ఉంది.

### ప్రియాంక చోప్రా 4 సినిమాల

## బడ్జెట్ 5000 కోట్లు



అగ్ర కథానాయిక ప్రియాంక చోప్రా నటించిన రెండు ప్రాజెక్టుల బడ్జెట్ 4200 కోట్లు. నాలుగు సినిమాల బడ్జెట్ 5000 కోట్లు.. ఈ లెక్కలు చూస్తుంటే మతి చెడిపోతోంది కదూ? కానీ ఇది నిజం. ఇంత భారీ బడ్జెట్లతో నిర్మిస్తున్న ప్రాజెక్టుల్లో భాగం అవుతున్న ఏకైక నటి పీసీ. మహేష్ – రాజమౌళితో కలిసి చేస్తున్న వారణాసి 150 మిలియన్ డాలర్ల బడ్జెట్ తో రూపొందుతోంది.. అంటే సుమారు 1400 కోట్లకు ఇది సమానం. ఇప్పటికే స్ట్రీమింగ్ లో ఉన్న వెబ్ సిరీస్ –సిటాడెల్–కి 300 మిలియన్ డాలర్లు ఖర్చు చేసారు. అంటే సుమారు రూ.2800కోట్ల బడ్జెట్ వెచ్చించారు. తదుపరి సిటాడెల్ సీజన్ 2 విడుదల కావాల్సి ఉంది. సిటాడెల్ సీజన్ 1 లో ప్రియాంక చోప్రా యాక్షన్ ప్యాక్డ్ రోల్ అందరి దృష్టిని ఆకర్షించింది. పీసీ నటించిన వాటిలో, కేవలం రెండు ప్రాజెక్టుల కోసం ఖర్చయిన బడ్జెట్ 4200 కోట్లు. ప్రస్తుతం –వారణాసి– చిత్రీకరణ శరవేగంగా పూర్తవుతోంది. ఆ తర్వాత కూడా అత్యంత భారీ బడ్జెట్ తో రూపొందించనున్న చిత్రాలలో ప్రియాంక చోప్రా నటిస్తోంది. తదుపరి హృతిక్ రోషన్ సరసన క్రిష్ 4 లో నటించాల్సి ఉంది. ఈ సినిమా బడ్జెట్ 500 కోట్లు అని ప్రచారం ఉంది. కానీ భాగస్వామ్య నిర్మాణ సంస్థ యష్ రాజ్ ఫిలింస్ తో సమస్యల కారణంగా ఈ ప్రాజెక్ట్ ఆలస్యమయ్యేందుకు ఛాన్సుందని కథనాలొస్తున్నాయి. అలాగే ఫర్హాన్ అక్తర్ తో జీలే జరా లాంటి భారీ మల్టీస్టారర్ లోను ప్రియాంక చోప్రా నటించాల్సి ఉంది. ఈ సినిమా బడ్జెట్ 200 కోట్లు అని ప్రచారం ఉంది. పై నాలుగు సినిమాలు కలుపుకుంటే సుమారు 5000 కోట్ల బడ్జెట్ అంచనా.



## పెళ్లికేం తొందరలేదు

'వివాహం విషయంలో తొందర లేదు. పెళ్లి చేసుకుంటాను. కానీ దానికంటూ సమయం రావాలి. సరైన వ్యక్తి నా జీవితంలోకి వచ్చినప్పుడే నేను వివాహ బంధంలోకి అడుగు పెడతాను. అప్పుడు నేనే స్వయంగా నా సోషల్ మీడియా అకౌంట్లో ఈ విషయాన్ని పోస్ట్ చేస్తాను. ఆ విషయాన్ని మీతో పంచుకునే మొదటి వ్యక్తిని కూడా నేనే అవుతాను. అప్పటివరకు రూమర్స్ ని నమ్మకండి' అని అంటోంది మృణాల్ ఠాకూర్ తన పెళ్లి గురించి తానే స్వయంగా ప్రకటిస్తానని చెప్పడంతో ఇకపై ఆమెపై ఎన్ని రూమర్స్ వచ్చినా.. అవన్నీ ఫేక్ అని స్పష్టం చేసింది.

## మెగాస్టార్ మూవీలో అనస్వరకు చాన్స్!?

డైరెక్టర్ బాబి కొల్లి డైరెక్షన్‌లో మెగాస్టార్ చిరంజీవి ఓ భారీ యాక్షన్ డ్రామా చేయబోతున్నారు. దీన్ని దళపతి విజయ్‌తో –జన నాయగన్–, యష్‌తో –టాక్సిక్– మూవీలను నిర్మిస్తున్న కెవిఎన్ ప్రొడక్షన్స్ అధినేత వెంకట్ కె. నారాయణ నిర్మించబోతున్నారు. దీనికి సంబంధించిన ప్రీ ప్రొడక్షన్ వర్క్ చాలా రోజులుగా జరుగుతోంది. ఈ మూవీని తండ్రీ కూతుళ్ల అనుబంధం నేపథ్యంలో పవర్ ఫుల్ స్టోరీగా తెరపైకి తీసుకొస్తున్నారు. ఇందు కోసం చిరుకు కూతురుగా ఎవరైతే బాగుంటుందని ఇప్పటికే కొంత మంది యంగ్ క్రేజీ హీరోయిన్‌ల పేర్లను పరిశీలించిన టీమ్ ఫైనల్‌గా –రేఖా చిత్రం–, ఛాంపియన్, విత్ లవ్ చిత్రాల ఫేమ్  అత్యంత ప్రాధాన్యం ఉండటంతో ఆ క్యారెక్టర్‌లో బాగా పాపులర్ అయిన నటి అయితే బాగుంటుందని భావించిన మేకర్స్, డైరెక్టర్ బాబీ ఆమెను ఫైనల్ చేశారట.



## అల్లు- అట్లీ సినిమాలో జాన్వీ కపూర్?

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, సెన్సేషనల్ డైరెక్టర్ అట్లీ కాంబినేషన్‌లో వస్తున్న సినిమా టాలీవుడ్‌లో మోస్ట్ అవేటెడ్ మూవీగా మారింది. ఇప్పటికే ఈ సినిమాలో బాలీవుడ్ స్టార్ హీరోయిన్ దీపికా పదుకొణె నటిస్తున్నట్లు అధికారికంగా ప్రకటించడంతో సినిమాపై భారీ హైప్ క్రియేట్ అయ్యింది. ఈ సైన్స్ ఫిక్షన్ అడ్వెంచర్ మూవీలో క్యాస్టింగ్ విషయంలో అట్లీ ఎక్కడా రాజీ పడటం లేదు. ఇప్పటికే రష్మిక మందన్న నెగెటివ్ షేడ్ ఉన్న రోల్ చేస్తోందనే వార్తలతో పాటు, మృణాల్ ఠాకూర్ కూడా ఒక కీలక పాత్రలో నటిస్తోందని వినికిడి. అయితే ఇప్పుడు వినిపిస్తున్న మరో ఆసక్తికరమైన అప్‌డేట్ ఏంటంటే.. ఈ మెగా క్యాస్టింగ్‌లో మరో స్టార్ హీరోయిన్ చేరబోతోంది. శ్రీదేవి వారసురాలు, బాలీవుడ్ యంగ్ బ్యూటీ జాన్వీ కపూర్ ఈ ప్రతిష్టాత్మక చిత్రంలో మరో కథానాయికగా ఫిక్స్ అయినట్లు సమాచారం. ఇప్పటికే జాన్వీ పేరు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నా, మేకర్స్ త్వరలోనే దీనిపై ఒక అధికారిక ప్రకటన చేసే అవకాశం ఉందట. ఒకే సినిమాలో దీపికా, రష్మిక, మృణాల్‌తో పాటు జాన్వీ కూడా తోడవ్వడం అంటే అట్లీ ఏ రేంజ్ లో ప్లాన్ చేస్తున్నారో అర్థం చేసుకోవచ్చు.




## రోషన్ మేకతో ప్రీతి ముకుందన్ రొమాన్స్!

ఛాంపియన్ సినిమాతో మంచి విజయాన్ని తన ఖాతాలో వేసుకున్న రోషన్ మేక.. ఇప్పుడు మరో సినిమాతో ప్రేక్షకుల ముందుకు రానున్నారు. అదే 'ఏమో ఏమో ఇది'. శైలేష్ కొలను దర్శకత్వంలో రొమాంటిక్ కామెడీ చిత్రంగా




వస్తున్న ఈ చిత్రాన్ని సితార ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్ పై సూర్యదేవర నాగవంశీ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇందులో ప్రీతి ముకుందన్ హీరోయిన్ గా ఎంపికయింది. వాలెంటైన్స్ డే సందర్భంగా ఈ సినిమా నుండి చిత్ర బృందం ది ఫస్ట్ బ్రీజ్ పేరుతో ఒక చిన్న గ్లింప్స్ విడుదల చేసింది. బయట అమ్మాయిలు ఎలా ఉన్నారో తెలుసా అంటూ రోషన్ జెన్ జీ పదాలు చెప్పడం ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. మొత్తానికి అయితే ఛాంపియన్ లాంటి చిత్రాలతో ప్రేక్షకులను అలరించిన రోషన్ మేక.. ఇప్పుడు 'ఏమో ఏమో ఇది' అనే ఒక రొమాంటిక్ కామెడీ చిత్రంతో ప్రేక్షకుల ముందుకు రానున్నారు.

## హర్ట్ అయిన మాళవిక



రాజాసాబ్ సినిమాలో వాడిన గ్రాఫిక్స్, బాడీ డబుల్స్ మీద వస్తున్న విమర్శలు హీరోయిన్ మాళవిక మోహనన్‌ను బాగా ఇబ్బంది పెట్టినట్లు కనిపిస్తోంది. సాధారణంగా నటీనటులు తమపై వచ్చే విమర్శలను పట్టించుకోరు. కానీ కొన్నిసార్లు తాము పడ్డ కష్టాన్ని తక్కువ చేసి చూపిస్తే ఎవరికైనా కోపం రావడం సహజం. మాళవిక విషయంలో కూడా అదే జరిగింది. ఆమె తన సొంతంగా స్టంట్స్ చేయలేదని, కేవలం బాడీ డబుల్స్ తోనే పనైపోయిందని వస్తున్న కథనాలు ఆమెను బాగా హర్ట్ చేశాయి. అందుకే ఈసారి కేవలం మాటలతో కాకుండా, ఏకంగా సాక్ష్యాలతో రంగంలోకి దిగింది ఈ ముద్దుగుమ్మ. తను 'ది రాజాసాబ్' కోసం నిజంగానే రిస్క్ తీసుకుని స్టంట్స్ చేశానని నిరూపించడానికి మాళవిక కొన్ని మేకింగ్ వీడియోలను సోషల్ మీడియాలో షేర్ చేసింది. నెట్టింట వైరల్ అవుతున్న బాడీ డబుల్ ఫోటోలపై క్లారిటీ ఇస్తూ.. తను చిన్నప్పటి నుండే చాలా స్పోర్టివ్‌గా ఉంటానని, ఫిజికల్‌గా ఛాలెంజింగ్ పనులు చేయడం తనకి ఇష్టమని క్లియర్ గా చెప్పేసింది.

# కాసో్క.. దాయాది!




టీ20 ప్రపంచ కప్ 2026లో క్రికెట్ ఫ్యాన్స్ ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న భారత్-పాకిస్థాన్ మహా సమరానికి వర్షం ముప్పు పొంచి ఉంది. ఆదివారం కొలంబోలోని ఆర్.ప్రేమదాస స్టేడియంలో ఈ మ్యాచ్ జరగాల్సి ఉండగా.. శనివారం సాయంత్రమే అక్కడ వాతావరణం మారిపోయింది. శనివారం సాయంత్రం కొలంబోలో తేలికపాటి వర్షం ప్రారంభమైంది. దీంతో స్టేడియం సిబ్బంది వెంటనే అప్రమత్తమై పిచ్‌తో పాటు గ్రౌండ్ మొత్తాన్ని కవర్లతో కప్పేశారు.

ఆకాశం మేఘావృతమై ఉండటంతో అర్ధరాత్రి వరకు భారీ వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా ఈ అకాల వర్షాలు కురుస్తున్నాయని శ్రీలంక వాతావరణ కేంద్రం తెలిపింది. శ్రీలంక వాతావరణ శాఖ నివేదిక ప్రకారం.. ఆదివారం మ్యాచ్ జరిగే సమయంలో కొలంబోలో 70శాతం వరకు వర్షం కురిసే అవకాశం ఉంది.

## నేడే చెమటలు పుట్టించే మ్యాచ్.. అడ్డం పడతానంటున్న వరుణుడు

ఒకవేళ వర్షం అంతరాయం కలిగిస్తే.. కనీసం ఫలితం తేలాలంటే ఇరు జట్లు తలా 5 ఓవర్లు ఆడాల్సి ఉంటుంది. పూర్తి స్థాయిలో మ్యాచ్ జరగాలంటే వర్షం తగ్గుముఖం పట్టాలి. అదృష్టవశాత్తూ.. ఆర్.ప్రేమదాస స్టేడియంలో డ్రైనేజీ వ్యవస్థ చాలా అత్యాధునికంగా ఉంది. వర్షం ఆగిపోయిన 20 నిమిషాల్లోనే మైదానాన్ని సిద్ధం చేసే సౌకర్యం ఇక్కడ ఉంది.

**మ్యాచ్ రద్దయితే ?**

ఒకవేళ వర్షం కారణంగా మ్యాచ్ నిర్వహించడం సాధ్యం కాకపోతే ఐసీసీ నిబంధనల ప్రకారం ఇరు జట్లకు ఒక్కో పాయింట్ కేటాయిస్తారు. ఇదే జరిగితే పాకిస్థాన్‌కు కలిసొచ్చే అంశం. ప్రస్తుతం భారత్, పాక్ రెండు జట్లు తమ మొదటి రెండు మ్యాచ్‌లు గెలిచి 4 పాయింట్లతో ఉన్నాయి. మ్యాచ్ రద్దయి తలో పాయింట్ వస్తే ఇరు జట్ల ఖాతాలో 5 పాయింట్లు చేరుతాయి. దీనివల్ల భారత్, పాకిస్థాన్ నేరుగా సూపర్-8 దశకు క్వాలిఫై అవుతాయి. భారత్-పాక్ మ్యాచ్ రద్దయి ఆ రెండు జట్లు సూపర్-8కి చేరితే.. గ్రూప్-ఏలోని మిగిలిన మూడు జట్లు టోర్నీ నుంచి నిష్క్రమించాల్సి వస్తుంది. 3 మ్యాచ్‌ల్లో 2 పాయింట్లతో ఉన్న అమెరికా, తన తదుపరి మ్యాచ్ గెలిచినా గరిష్టంగా 4 పాయింట్లకే చేరుకుంటుంది. మరోవైపు నెదర్లాండ్స్ జట్టు ఇప్పటివరకు 2 పాయింట్లతోనే ఉంది.. తదుపరి మ్యాచ్ గెలిచినా భారత్, పాక్ కంటే వెనుకబడతారు. ఆడిన 2 మ్యాచ్‌ల్లోనూ ఓడిపోయి 0 పాయింట్లతో ఉన్న నమీబియాకు ఇప్పటికే అవకాశాలు మూసుకుపోయాయి. ఐసీసీ నిబంధనల ప్రకారం టీ20 వరల్డ్ కప్ 2026లో గ్రూప్ దశ మ్యాచ్‌లకు అలాగే సూపర్-8 మ్యాచ్‌లకు రిజర్వ్ డే లేదు. కేవలం సెమీఫైనల్, ఫైనల్ మ్యాచ్‌లకు మాత్రమే రిజర్వ్ డే కేటాయించారు. ఒకవేళ ఆదివారం మ్యాచ్ జరగకపోతే క్రికెట్ అభిమానులకు నిరాశ తప్పదు. అయితే మ్యాచ్ ఫలితం తేలితే మాత్రం గెలిచిన జట్టు నేరుగా సూపర్-8కి వెళ్తుంది, ఓడిన జట్టు తన తదుపరి మ్యాచ్ వరకు వేచి చూడాల్సి ఉంటుంది.




## దమ్ముంటే అభిషేక్‌ను ఆడించాలి: సల్మాన్ అలీ




టీ20 ప్రపంచ కప్ 2026లో భాగంగా ఆదివారం కొలంబో వేదికగా జరగనున్న భారత్-పాకిస్థాన్ మ్యాచ్‌కు ముందు మైండ్ గేమ్స్ మొదలయ్యాయి. పాకిస్థాన్ కెప్టెన్ సల్మాన్ అలీ ఆఘా, టీమిండియా కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్‌కు ఓ ఆసక్తికరమైన సవాల్ విసిరారు. టీమిండియా యువ ఓపెనర్ అభిషేక్ శర్మ గత నమీబియా మ్యాచ్‌కు ముందు కడుపులో నొప్పి కారణంగా దూరమైన సంగతి తెలిసిందే. అయితే పాక్ కెప్టెన్ సల్మాన్ ఆఘా మాత్రం అభిషేక్ కోలుకోవాలని, అతను భారత్ తుది జట్టులో ఉండాలని కోరుకుంటున్నట్లు వెల్లడించాడు. 'అభిషేక్ శర్మ రేపటి మ్యాచ్ ఆడాలని నేను కోరుకుంటున్నాను. అతను త్వరగా కోలుకోవాలని ఆశిస్తున్నాను. మేము అత్యుత్తమ ఆటగాళ్లతోనే పోటీ పడాలనుకుంటున్నాము' అని పాక్ కెప్టెన్ సల్మాన్ అలీ ఆఘా మీడియా సమావేశంలో పేర్కొన్నాడు.



## భారత్‌దే గెలుపు: హర్భజన్ సింగ్

పాకిస్థాన్‌తో జరగనున్న మ్యాచ్‌లో భారత్ అద్భుత విజయం సాధిస్తుందని టీమిండియా మాజీ క్రికెటర్ హర్భజన్ సింగ్ అన్నాడు. పాకిస్థాన్ బౌలర్లను ఎదుర్కొనే సత్తా మన వారికి ఉందని ధీమా వ్యక్తం చేశాడు. రాంచీలో ఆయన మీడియాతో మాట్లాడుతూ, ఈ మ్యాచ్‌లో భారత్ గెలుపు ఖాయమని వ్యాఖ్యానించాడు. పాకిస్థాన్ స్పిన్నర్ ఉస్మాన్ తారిఖ్‌ను మనవాళ్లు సమర్థవంతంగా ఎదుర్కొంటారని అన్నాడు. రేపు పాకిస్థాన్‌తో ఆడబోయే మ్యాచ్ మన వారికి ప్రత్యేకమేమీ కాదని, వారు నిత్యం ఆడుతున్నట్లే ఆడుతారని అభిప్రాయపడ్డాడు. భారత్ జట్టు కూర్పు చాలా బాగుందని అన్నాడు. ఒత్తిడి లేకుండా మెరుగైన ప్రదర్శన చేసి విజయం సాధిస్తారని హర్భజన్ సింగ్ అన్నాడు.





## భారత్‌ను ఓడించే 'సీక్రెట్ రెసిపీ' ఇదే: అఫ్రిది

హై-వోల్టేజ్ మ్యాచ్‌కు ముందు పాక్ మాజీ దిగ్గజం షాహిద్ అఫ్రిది తన దేశ జట్టుకు దిశానిర్దేశం చేశారు. సూర్యకుమార్ యాదవ్ కెప్టెన్సీలోని టీమిండియాను కట్టడి చేసేందుకు ఆయన రూపొందించిన ఈ మాస్టర్ ప్లాన్ ఇప్పుడు క్రీడా వర్గాల్లో హాట్ టాపిక్ అయింది. సాధారణంగా మైదానంలో అగ్రెసివ్ ఆటతీరుకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచే అఫ్రిది.. ఈ కీలక పోరు విషయంలో మాత్రం పాక్ కెప్టెన్ సల్మాన్ అలీ ఆఘాకు ఆసక్తికరమైన సలహా ఇచ్చారు. భారత్ వంటి మేటి జట్టును ఓడించాలంటే కేవలం బంతిని బలంగా బాదడం మాత్రమే సరిపోదని, అత్యంత జాగ్రత్తగా ఆడటం అవసరమని ఆయన పేర్కొన్నారు. కేవలం మెరుపులు మెరిపించడం కంటే, ప్రతి ఓవర్‌లోనూ క్రమశిక్షణతో కూడిన వ్యూహాలను అమలు చేయడమే విజయానికి అసలైన రహస్యమని షాహిద్ అఫ్రిది విశ్లేషించారు. అధిక ఒత్తిడి ఉండే ఇలాంటి మ్యాచ్‌ల్లో మెరుపులు మాయాజాలం కంటే బేసిక్స్ మీద పట్టు సాధించడం ముఖ్యమని షాహిద్ అఫ్రిది అభిప్రాయపడ్డారు. బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్ అనే మూడు కీలక విభాగాల్లో ఏ జట్టు అయితే తక్కువ తప్పులు చేస్తుందో.. వారికే గెలుపు అవకాశాలు మెండుగా ఉంటాయని ఆయన తేల్చి చెప్పారు. మైదానంలో ఎంత ప్రశాంతంగా ఉంటే, అంతగా మెరుగైన ఫలితాలు వస్తాయని ఆయన పాక్ ఆటగాళ్లకు సూచించారు.

## స్కాట్లాండ్‌పై ఇంగ్లండ్ విన్




టీ20 ప్రపంచకప్ 2026లో భాగంగా కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్‌లో జరిగిన మ్యాచ్‌లో తమ పొరుగుదేశం స్కాట్లాండ్‌పై ఇంగ్లండ్ 5 వికెట్ల తేడాతో విజయం సాధించింది. టామ్ బాంటన్ (63 నాటౌట్) అద్భుత అర్ధశతకంతో జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. ఇటీవల విండీస్ చేతిలో ఓడిన ఇంగ్లండ్ కు ఈ విజయం ఊరటనిచ్చింది. 153 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఇంగ్లండ్‌కు ఆరంభంలోనే గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఓపెనర్లు ఫిల్ సాల్ట్ (2), కెప్టెన్ జోస్ బట్లర్ (3) స్వల్ప స్కోర్లకే పెవిలియన్‌కు చేరారు. ఈ క్లిష్ట పరిస్థితుల్లో జాకబ్ బెథెల్ (32)తో కలిసి బాంటన్ ఇన్నింగ్స్‌ను చక్కదిద్దాడు. వీరిద్దరూ మూడో వికెట్‌కు 66 పరుగుల కీలక భాగస్వామ్యం నెలకొల్పారు. బెథెల్ ఔటైనప్పటికీ, బాంటన్ మాత్రం దూకుడుగా ఆడి 33 బంతుల్లోనే హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. చివరి వరకు క్రీజులో నిలబడి మరో 10 బంతులు మిగిలి ఉండగానే జట్టుకు విజయాన్ని అందించాడు. అంతకుముందు టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్న ఇంగ్లండ్, స్కాట్లాండ్‌ను 19.4 ఓవర్లలో 152 పరుగులకు ఆలౌట్ చేసింది. ఇంగ్లండ్ బౌలర్ జోఫ్రా ఆర్చర్ ఆరంభంలోనే రెండు వికెట్లు పడగొట్టినా, స్కాట్లాండ్ బ్యాటర్లు రిచీ బెరింగ్టన్ (49), మైఖేల్ జోన్స్ (33) రాణించారు. దీంతో స్కాట్లాండ్ పోరాడగలిగే స్కోరు సాధించింది. ఇంగ్లండ్ బౌలర్లలో ఆదిల్ రషీద్ 3 వికెట్లు పడగొట్టాడు.



## ప్రియురాలితో పాండ్యా

పాకిస్థాన్‌తో జరగనున్న హైవోల్టేజ్ మ్యాచ్ కోసం కొలంబోలో అడుగుపెట్టిన టీమిండియా ఆల్ రౌండర్ హార్దిక్ పాండ్య హోటల్ లాబీలో తన గర్ల్‌ఫ్రెండ్ మహిక శర్మతో కనిపించాడు. తద్వారా అతడు మరోసారి వార్తల్లో నిలిచాడు. బీసీసీఐ నిబంధనల ప్రకారం జట్టు విదేశీ పర్యటనల్లో ఉన్నప్పుడు ఆటగాళ్లు కుటుంబ సభ్యులతో ఉండటానికి వీలులేదు. కానీ పాండ్యా గర్ల్‌ఫ్రెండ్‌తో ఉన్న వీడియో సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. ప్రేమికుల దినోత్సవం సందర్భంగా కొత్తగా తన మెడ మీద హార్దిక్ పాండ్య ఎమ్ అనే అక్షరాన్ని టటూగా వేయించుకున్నాడని తెలుస్తోంది.

## మార్క్‌రమ్ విధ్వంసం

### కివీస్‌కు చుక్కలు.

### 7 వికెట్ల తేడాతో సఫారీల విన్



అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియం వేదికగా జరిగిన టీ20 ప్రపంచకప్ మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా జట్టు న్యూజిలాండ్‌ను చిత్తుగా ఓడించింది. బౌలింగ్, బ్యాటింగ్ విభాగాల్లో సంపూర్ణ ఆధిపత్యం ప్రదర్శించిన సఫారీలు.. 7 వికెట్ల తేడాతో ఘన విజయాన్ని అందుకున్నారు. తొలుత బౌలింగ్‌లో మార్కో యాన్సెన్ మాయాజాలం చేయగా, అనంతరం ఛేదనలో కెప్టెన్ అయిడెన్ మార్క్‌రమ్ విధ్వంసక ఇన్నింగ్స్‌తో కివీస్‌ను కోలుకోలేని దెబ్బతీశాడు. ఈ విజయంతో గ్రూప్-డిలో దక్షిణాఫ్రికా తన స్థానాన్ని మరింత పటిష్టం చేసుకుంది. టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్న దక్షిణాఫ్రికాకు న్యూజిలాండ్ బ్యాటర్లు ఆరంభంలో గట్టి పోటీ ఇచ్చారు. ముఖ్యంగా ఫిన్ అలెన్ (17 బంతుల్లో 31), మార్క్ చాప్‌మన్ (26 బంతుల్లో 48) వేగంగా పరుగులు సాధించారు. అయితే, కీలక సమయాల్లో మార్కో యాన్సెన్ విజృంభించాడు. తన నాలుగు ఓవర్ల స్పెల్‌లో 40 పరుగులిచ్చి 4 కీలక వికెట్లు పడగొట్టి కివీస్ పతనాన్ని శాసించాడు. దీంతో న్యూజిలాండ్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 175 పరుగులు మాత్రమే చేయగలిగింది. అనంతరం 176 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన దక్షిణాఫ్రికాకు ఓపెనర్లు క్వింటన్ డి కాక్ (20), ర్యాన్ రికెల్టన్ (21) మెరుపు ఆరంభాన్ని అందించారు. పవర్‌ప్లేలోనే 83 పరుగులు రాబట్టి మ్యాచ్‌ను తమవైపు తిప్పుకున్నారు. అయితే, అసలు సిసలు విధ్వంసం కెప్టెన్ అయిడెన్ మార్క్‌రమ్ బ్యాట్ నుంచి వచ్చింది. ఆకాశమే హద్దుగా చెలరేగిన మార్క్‌రమ్, కేవలం 44 బంతుల్లో 8 ఫోర్లు, 4 సిక్సర్లతో అజేయంగా 86 పరుగులు సాధించాడు. డేవిడ్ మిల్లర్ (24 నాటౌట్)తో కలిసి జట్టును విజయతీరాలకు చేర్చాడు. సఫారీలు కేవలం 17.1 ఓవర్లలోనే 3 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని అలవోకగా ఛేదించారు. ఈ ఆల్ రౌండ్ ప్రదర్శనతో సఫారీలు కివీస్‌ను అన్ని విభాగాల్లోనూ డామినేట్ చేసి విజయాన్ని సొంతం చేసుకున్నారు. ఈ మెగా టోర్నీలో దక్షిణాఫ్రికాకు ఇది వరుసగా మూడో విజయం.



## ఐర్లాండ్ దంచుడే దంచుడు

### ఒమన్‌పై ఆకాశమే హద్దుగా బ్యాటింగ్

టీ20 ప్రపంచ కప్ 2026లో ఐర్లాండ్ జట్టు ఎట్టకేలకు ఫామ్‌లోకి వచ్చింది. వరుస ఓటములతో సతమతమవుతున్న ఆ జట్టు ఒమన్‌పై జరిగిన మ్యాచ్‌లో ఆకాశమే హద్దుగా చెలరేగిపోయింది. కొలంబో వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో ఐర్లాండ్ బ్యాటర్లు.. బౌలర్లు సమిష్టిగా రాణించి 96 పరుగుల భారీ విజయాన్ని నమోదు చేశారు. ఈ టోర్నీలో ఐర్లాండ్‌కు ఇదే తొలి విజయం కావడం విశేషం. టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన ఐర్లాండ్ జట్టుకు ఒమన్ బౌలర్లు ఏమాత్రం అడ్డుకట్ట వేయలేకపోయారు. ప్రారంభం నుంచే ఐర్లాండ్ బ్యాటర్లు ధాటిగా ఆడారు. ముఖ్యంగా తాత్కాలిక కెప్టెన్ లోర్కాన్ టక్కర్ అద్భుతమైన ఇన్నింగ్స్‌తో జట్టును ముందుండి నడిపించాడు. లోర్కాన్ టక్కర్ కేవలం కొద్ది పరుగుల తేడాతో సెంచరీ మిస్ చేసుకున్నప్పటికీ.. 94 పరుగులతో నాటౌట్‌గా నిలిచి జట్టు భారీ స్కోరు సాధించడంలో కీలక పాత్ర పోషించాడు. అతనికి తోడుగా గెరెత్ డెలానీ (56) అద్భుత అర్ధ శతకంతో అలరించగా, ఇన్నింగ్స్ చివరలో జార్జ్ డాక్రెల్ విధ్వంసం సృష్టించాడు. డాక్రెల్ కేవలం 9 బంతుల్లోనే 5 సిక్సర్లతో 35 పరుగులు చేయడంతో ఐర్లాండ్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 235 పరుగుల భారీ స్కోరును నమోదు చేసింది. ఐర్లాండ్ సాధించిన ఈ 235 పరుగుల స్కోరు వారి టీ20 అంతర్జాతీయ క్రికెట్ చరిత్రలోనే అత్యధిక స్కోరుగా రికార్డులకు ఎక్కింది. అంతేకాకుండా, టీ20 ప్రపంచకప్ చరిత్రలో ఇది రెండో అత్యధిక జట్టు స్కోరు కావడం విశేషం. ఒమన్ బౌలర్లలో షకీల్ అహ్మద్ 3 వికెట్లు తీసినప్పటికీ.. భారీగా పరుగులు సమర్పించుకోవాల్సి వచ్చింది.

ఈవార్తలు ప్రజావాణి


సంపాదకీయం

www.evarthalu.com

నేటి ఈవార్తలు

ఆదివారం 15-2-2026

# కక్షలేనా.. ప్రజాక్షేమమేది?



**ప్రజాస్వామ్యంలో** అధికారం అంటే అహంకారం కాదు, అంతులేని బాధ్యత. ఎన్నికల వేళ ఊరూరా తిరిగి, ప్రజల కాళ్లు మొక్కి, 'ఒక్క అవకాశం ఇవ్వండి.. మీ తలరాత మారుస్తాం' అని హామీలు గుప్పించి గద్దెనెక్కిన పాలకులకు.. తీరా అధికారం దక్కాక అసలు లక్ష్యం విస్మరించడం పరిపాటిగా మారింది. ప్రస్తుతం తెలుగు రాష్ట్రాల్లో సాగుతున్న రాజకీయాలు చూస్తుంటే.. ప్రజా సంక్షేమం కంటే ప్రతిపక్షాలను అణచివేయడమే పరమావధిగా కనిపిస్తోంది. తెలంగాణలోనైనా, ఆంధ్రప్రదేశ్‌లోనైనా ప్రభుత్వం మారగానే మునుపటి పాలకులపై విచారణలు, కేసులు, అరెస్టుల పర్వం సర్వసాధారణమైపోయింది. తప్పు చేసిన వారు శిక్షార్హులే, అందులో సందేహం లేదు. కానీ, ప్రభుత్వ యంత్రాంగం మొత్తం కేవలం గత పాలకుల అవినీతి'ని వెలికితీయడానికే అంకితమైతే, మరి వర్తమానంలో ప్రజల కష్టాల పరిస్థితి ఏమిటి? ప్రతిపక్ష నేతలను ఇరకాటంలో పెట్టడానికి వెచ్చించే సమయం, మేధస్సులో సగం ప్రజల సమస్యల పరిష్కారానికి కేటాయిస్తే పాలన మరోలా ఉండేది. బడ్జెట్లలో వేల కోట్లు కేటాయిస్తున్నామని గణాంకాలు చెబుతున్నా, క్షేత్రస్థాయిలో సామాన్యుడి బతుకు భారంగానే ఉంది. పెరిగిన ధరలు, నిరుద్యోగం, విద్య-వైద్య రంగాల్లో మౌలిక సదుపాయాల కొరత సామాన్యుడిని వేధిస్తూనే ఉన్నాయి. రైతులకు భరోసా కల్పించడంలో, యువతకు ఉపాధి చూపడంలో ప్రభుత్వాలు వేగం పుంజుకోవాల్సి ఉంది. అధికారం కట్టబెట్టిన ప్రజలు తమ కష్టాలు తీరుతాయని ఆశించారు. కానీ, రాజకీయ కురుక్షేత్రంలో తమ సమస్యలు బలైపోతాయని ఊహించలేదు. ఓటు వేసి గెలిపించిన ప్రజలు కోరుకునేది కేవలం ప్రత్యర్థులపై పైచేయి సాధించడం కాదు. రాజకీయ కక్షలకు తావులేకుండా అభివృద్ధి పనులు సాగాలి. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన ప్రతి వాగ్దానాన్ని కాలయాపన చేయకుండా నెరవేర్చాలి. ప్రతి పైసా ప్రజల సొత్తు. దాన్ని ఆశ్రిత పక్షపాతానికి కాకుండా ప్రజా ప్రయోజనాలకే వాడాలి. రాజకీయాల్లో గెలుపోటములు సహజం. అధికారం శాశ్వతం కాదు. కానీ, అధికారంలో ఉన్నప్పుడు చేసిన మంచి పనులు, అందించిన సంక్షేమం మాత్రమే ప్రజల గుండెల్లో నిలుస్తాయి. ప్రతిపక్షాలను రాజకీయంగా ఎదుర్కోవాలి కానీ, పాలనను విస్మరించి కేవలం కేసులతో కాలక్షేపం చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధం. పాలకులు ఇకనైనా మేల్కొని, తమను గెలిపించిన ప్రజల ఆశలను ఆశయాలను నెరవేర్చడమే ధ్యేయంగా సాగాలి. లేదంటే, అదే ప్రజలు మరోసారి తమ తీర్పుతో చరమగీతం పాడుతారు.

**- ఈవార్తలు సంపాదకీయ విభాగం**



ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది భక్తులు పరమశివుడిని ఆరాధించే పవిత్ర పర్వదినం మహాశివరాత్రి. భారతీయ సంస్కృతిలో పండుగలు వేడుకలు మాత్రమే కాదు, అవి మనిషిని ఉన్నతమైన మార్గంలో నడిపించే దిక్సూచీలు. సృష్టి, స్థితి, లయ కారకుడైన శివుడు ఈ రోజున లింగోద్భవ మూర్తిగా ఆవిర్భవించినట్లు పురాణాలు చెప్తున్నాయి. అయితే, నేటి యాంత్రిక సమాజంలో శివరాత్రి ప్రాముఖ్యత కేవలం దేవాలయ సందర్శనలు, ఉపవాసాలకు పరిమితం కాకుండా, దాని వెనుక ఉన్న తాత్విక సందేశాన్ని అర్థం చేసుకోవడం ఎంతో అవసరం. శివరాత్రి నాడు చేసే జాగరణ కేవలం నిద్రమానడం కాదు, అది చైతన్యానికి సంకేతం. నేటి సమాజంలో మనిషి సౌకర్యాల వేటలో పడి తన అంతరాత్మను మరచిపోతున్నాడు.

## అంతర్మథనంతో ఆత్మ జాగరణ

మానసిక ఒత్తిడి, ఆందోళనల మధ్య గడుపుతున్న ఆధునిక మానవుడికి శివరాత్రి ఇచ్చే సందేశం నిశ్చలత్వం. ఆదిగురువుగా శివుడు ప్రబోధించిన యోగ మార్గం, ధ్యానం నేటి కాలంలో మానసిక ప్రశాంతతకు అత్యంత అవసరం. మహాశివరాత్రి నాడు భక్తులు ఆచరించే ఉపవాసం కేవలం ఆహారాన్ని త్యజించడం కాదు, అది అంతర్గత క్రమశిక్షణ. ఇంద్రియాల మీద నియంత్రణ సాధించడం ద్వారా మనస్సును ఏకాగ్రత వైపు మళ్లించడమే పరమార్థం. సోషల్ మీడియా, అనవసరపు సమాచార ధాటికి గురవుతున్న నేటి తరం, శివరాత్రి రోజున మౌనాన్ని, ఏకాగ్రతను పాటించడం ద్వారా తమ శక్తిని తిరిగి పుంజుకోవచ్చు. లోక రక్షణ కోసం హాలహలాన్ని మింగి నీలకంఠుడు అయిన శివుడు, బాధ్యతకు నిలువెత్తు సాక్ష్యం. సమాజంలో పెరుగుతున్న స్వార్థం, ద్వేషాల మధ్య శివుని త్యాగగుణం మనకు స్ఫూర్తినివ్వాలి. ఇతరుల కోసం మనం చేసే చిన్న సాయం కూడా శివార్చనతో సమానమని గ్రహించాలి. భార్యాభర్తల మధ్య అనుబంధానికి శివ-పార్వతుల కల్యాణం ఒక ఆదర్శం. భారతీయ సంస్కృతిలో వివాహం అనేది కేవలం ఇద్దరు వ్యక్తుల కలయిక మాత్రమే కాదు, అది రెండు ఆత్మల ఏకీకరణ. దీనికి అత్యున్నత నిదర్శనం శివ-పార్వతుల బంధం. నేటి వేగవంతమైన ప్రపంచంలో, చిన్నపాటి విభేదాలకే విచ్ఛిన్నమవుతున్న కుటుంబ వ్యవస్థలకు పార్వతీ పరమేశ్వరుల దాంపత్యం దిశానిర్దేశం చేస్తుంది. శివుడు తన శరీరంలో సగభాగాన్ని పార్వతీదేవికి ఇచ్చి అర్ధనారీశ్వరుడు అయ్యాడు.

ఇది ఒక రూపం మాత్రమే కాదు, భార్యాభర్తల మధ్య ఉండాల్సిన సమానత్వానికి పరమార్థం. నేటి సమాజంలో ఆధిపత్య పోరు కాకుండా, ఒకరినొకరు గౌరవించుకుంటూ, సమానమైన హోదాను ఇచ్చుకున్నప్పుడే ఆ బంధం పరిపూర్ణమవుతుందని ఈ రూపం మనకు బోధిస్తుంది. శివుడు వైరాగ్యానికి నిదర్శనం, పార్వతి సంసారానికి చిహ్నం. ఒకరు నిశ్చలత్వానికి ప్రతీక అయితే, మరొకరు చైతన్యానికి స్వరూపం. భిన్నమైన స్వభావాలు ఉన్నప్పటికీ, ఒకరినొకరు అర్థం చేసుకుని ఎలా కలిసి ఉండాలో వారి బంధం నిరూపిస్తుంది. నేటి జంటలు తమ అభిరుచులలో భేదాలు ఉన్నప్పుడు గొడవ పడకుండా, ఒకరికొకరు ఎలా కలిసి ఉండాలో వీరిని చూసి నేర్చుకోవాలి. శివుడిని భర్తగా పొందడానికి పార్వతీదేవి చేసిన కఠోర తపస్సు, ఆమెలోని నిబద్ధతకు, సహనానికి నిదర్శనం. అలాగే, సతీదేవి వియోగం తర్వాత శివుడు చూపిన అనురాగం అసాధారణం. ఏ బంధమైనా నిలబడాలంటే ఒకరిపై ఒకరికి అచంచలమైన నమ్మకం, ఓర్పు అవసరం. శివుడు స్మశానవాసి అయినప్పటికీ, పార్వతి కోరిక మేరకు గృహస్థుడిగా మారి సంసార బాధ్యతలను స్వీకరించాడు. పిల్లల పెంపకంలోనూ ఆ ఆది దంపతులు సమాన బాధ్యతను పంచుకున్నారు. నేటి కాలంలో కెరీర్, వ్యక్తిగత స్వేచ్ఛ వంటి కారణాలతో కుటుంబ బాధ్యతలను విస్మరించకుండా, భాగస్వామికి అండగా నిలవడమే అసలైన శివతత్వం. మహాశివరాత్రి అంటే ఒక చీకటి రాత్రి కాదు, అది అంతరంగంలోని చీకటిని (అజ్ఞానాన్ని) తొలగించి జ్ఞానజ్యోతిని వెలిగించే రాత్రి. ఆడంబరాల కన్నా ఆధ్యాత్మికతకు, క్రమశిక్షణకు పెద్దపీట వేయడమే ఈ పండుగ అసలైన వైశిష్ట్యం. నిరంతర సాధనతో, స్వచ్ఛమైన మనస్సుతో శివతత్వాన్ని అర్థం చేసుకున్నప్పుడే ఈ పర్వదినానికి అసలైన సార్థకత చేకూరుతుంది.

**-రాంమనోహర్ బండపెల్లి, ఆధ్యాత్మిక పండితుడు**

# విశ్వజనీన ఆధ్యాత్మిక గురువు సేవాలాల్



**భారతదేశ** ఆధ్యాత్మిక చరిత్రలో అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం, మానవీయ విలువల స్థాపన కోసం పోరాడిన మహనీయులలో సంత్ శ్రీ సేవాలాల్ మహరాజ్ అగ్రగణ్యుడు. 18వ శతాబ్దంలో బంజారా (గోర్) జాతిని అజ్ఞానం, మూఢనమ్మకాలు, సామాజిక అణచివేత నుండి విముక్తి చేసి, వారిని అహింసా మార్గం వైపు మళ్లించిన దార్శనికుడు. సేవాలాల్ మహరాజ్ 1739 ఫిబ్రవరి 15న అనంతపురం జిల్లాలోని గుత్తి సమీపంలో గల చెన్నకేశవపురం (ప్రస్తుత సేవాలాల్ గఢ్/రామగఢ్)లో జన్మించారు. ఆయన తల్లిదండ్రులు భీమా నాయక్, ధర్మిణి మాత. ఒక సాధారణ గిరిజన కుటుంబంలో జన్మించినా, చిన్నతనం నుండే ఆయన ఆధ్యాత్మిక చింతనతో, దైవ భక్తితో వెలిగారు. బంజారా జాతి ప్రజలు అప్పట్లో అనేక అపనమ్మకాలు, పశుబలులు వంటి అనాచారాల్లో చిక్కుకుని ఉండేవారు. సేవాలాల్ మహరాజ్ వాటిని ఖండించి, అహింసా మార్గాన్ని బోధించారు. జంతు బలులను ఆపాలని, మూగ జీవుల పట్ల కనికరం చూపాలని ఆయన తన జాతికి పిలుపునిచ్చారు. మద్యం, జూదం వంటి చెడు అలవాట్ల వల్ల బంజారా తండాలు ఆర్థికంగా కుంగిపోతున్న కాలంలో, ఆయన మద్యపాన నిషేధం గురించి బలంగా ప్రచారం చేశారు. కుల మతాలకు అతీతంగా మానవత్వాన్ని ప్రేమించాలని, స్త్రీలకు గౌరవం ఇవ్వాలని బోధించారు. సేవాలాల్ మహరాజ్ జగదాంబ దేవిని ఆరాధ్య దైవంగా కొలిచేవారు. ఆయన బంజారా సమాజానికి 22 సూత్రాలను (ధర్మాలను) ప్రబోధించారు. సత్యం పలకడం, పరాయి స్త్రీలను తల్లులుగా, సోదరీమణులుగా గౌరవించడం, ప్రకృతిని (చెట్లు, నీరు, భూమి) పూజించడం, సంరక్షించడం, అహింసను పాటించడం, దొంగతనం చేయకపోవడం వంటివి ప్రధానమైనవి. మొఘలులు, బ్రిటిష్ పాలకుల కాలంలో బంజారాల జీవనోపాధి దెబ్బతిన్నప్పుడు, సేవాలాల్ మహరాజ్ వారికి అండగా నిలిచారు. మొఘల్ దాడుల నుండి తన ప్రజలను కాపాడటానికి ఆయన సాహసోపేతమైన నాయకత్వాన్ని ప్రదర్శించారు. ఆయన ఒక యోగిగానే కాక, ఒక గొప్ప వ్యూహకర్తగా, యోధుడిగా కూడా పేరుపొందారు. మహారాష్ట్రలోని వాషిం జిల్లాలో ఉన్న పోహ్రా దేవి సేవాలాల్ మహరాజ్ సమాధి ఉన్న పుణ్యక్షేత్రం. దీనిని బంజారాల కాశీగా భావిస్తారు. ప్రతి ఏటా లక్షలాది మంది బంజారాలు ఇక్కడికి చేరుకుని తమ ఆరాధ్య దైవానికి మొక్కులు తీర్చుకుంటారు. సేవాలాల్ మహరాజ్ జయంతిని (ఫిబ్రవరి 15) నేడు తెలంగాణ, ఇతర రాష్ట్ర ప్రభుత్వాలు అధికారికంగా నిర్వహిస్తున్నాయి. సంత్ సేవాలాల్ మహరాజ్ కేవలం ఒక కులానికి చెందిన నాయకుడు కాదు, ఆయన ఒక విశ్వజనీన ఆధ్యాత్మిక గురువు. ఆయన బోధించిన అహింస, ప్రకృతి ప్రేమ, నైతిక విలువలు నేటి సమాజానికి ఎంతో అవసరం. 'సేవ భాయా.. సేవ భాయా..' అంటూ ఆయనను స్మరించుకోవడం అంటే, ఆయన చూపిన శాంతి మార్గంలో పయనించడమే.

**- శ్యామల్ నాయక్, వరంగల్ జిల్లా**

రచయితలకు ఆహ్వానం!

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!



పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

OWNED, PUBLISHED BY **BOMMAKANTI SHRAVAN KUMAR**, PRINTED BY SUNDAY PRINTING PRESS, #3-4297, SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR - 522006, ANDHRA PRADESH. PUBLISHED AT #4-36, BALWANTHAPOOR, MALLIAL MANDAL, JAGITIAL DISTRICT - 505452, TELANGANA, EMAIL ID: contact@evarthalu.com, PHONE NUMBER: 9440455811, EDITOR: **BOMMAKANTI SHRAVAN KUMAR**, RNI REGD NO.: TGTEL/25/A1385. CORPORATE OFFICE: #1-5-431/20/4, JONNABANDA, OLD ALWAL, MEDCHAL MALKAJGIRI DISTRICT - 500010, TELANGANA. Landline: 040-35673004.